

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

అక్షర **రాజముద్ర**

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA | RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | మంగళవారం | 16.09.2025 | సంపుటి : 2 | సంచిక :224 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Tuesday | 16.09.2025 | volume : 2 | Issue : 224 | Pages : 8 | Cost : 2/- |



## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575


# ప్రతి లైటూ వెలగాలి

## పకడ్బందీగా వీధి దీపాల నిర్వహణ



- సోలార్ పవర్‌పై సాధ్యాసాధ్యాల పరిశీలన
- ఐఐటి సంస్థలతో ఆడిటింగ్ జరిపేలా చర్యలు
- పెద్ద కంపెనీల నుంచి టెండర్ల ఆహ్వానం
- అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ ఆదేశం

వీధి దీపాల నిర్వహణ కోసం పెద్ద కంపెనీల నుంచి వెంటనే టెండర్లు పిలవాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. సోమవారం బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మున్సిపల్, పంచాయతీ రాజ్, జీహెచ్ఎంసీ అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారులకు పలు అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు.

**హైదరాబాద్, సెప్టెంబరు 15 :** రాష్ట్రంలోని అన్ని గ్రామాలు, పురపాలక సంఘాల్లో వీధి దీపాలపై పక్కాగా పర్యవేక్షణ ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. అవసరమైన అన్ని ప్రాంతాల్లో ఎల్ఈడీ లైట్లను బిగించి, వాటి నిర్వహణ బాధ్యతలను గ్రామాల్లో పంచాయతీలకు అప్పగించాలని సూచించారు. సంబంధిత డాష్ బోర్డులను మండలస్థాయిలో ఎంపీడీవోలకు, జిల్లాస్థాయిలో అదనపు కలెక్టర్లకు అప్పగించి పర్యవేక్షించాలన్నారు.

మిగతా 2 లో



### కళాశాలల యాజమాన్యలతో

# చర్చలు సఫలం

- నేటి నుంచి యథావిధిగా కాలేజీల ప్రారంభం
- దీపావళి లోగా 1200 కోట్ల బకాయిల విడుదల
- గత బీఆర్ఎస్ ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తుంగలో తొక్కిందన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్, సెప్టెంబర్ 15 :** తెలంగాణలోని వృత్తి విద్యా కళాశాలల యాజమాన్యాలతో ప్రభుత్వ చర్చలు సఫలమయ్యాయి. దీపావళి లోగా రూ.1200 కోట్ల బకాయిలు విడుదల చేయనున్నట్లు ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశంపై మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి కళాశాలల యాజమాన్యాల ప్రతినిధులతో జరిపిన చర్చలు ముగిశాయి. నాలుగేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ వృత్తి విద్యా కళాశాలలు బంద్ పాటిస్తున్న విషయం తెలిసిందే. ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశంపై మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాల ప్రతినిధులతో జరిపిన చర్చలు విజయవంతమయ్యాయి. చర్చలు సఫలమైన నేపథ్యంలో తరగతుల బంద్‌ను ఉపసంహరించుకున్నట్లు వృత్తి విద్యా కళాశాలల యాజమాన్యాలు ప్రకటించాయి. దీంతో మంగళవారం నుంచి తరగతులు యథాతథంగా కొనసాగనున్నాయి.

మిగతా 2 లో



ఏకపక్షంగా వేధించేందుకే

## అమెరికా ఆర్థిక బలప్రదర్శన

- వాషింగ్టన్ చెప్పినట్లు చేస్తే ప్రతిచర్యలు చేపడతాము
- హెచ్చరించిన చైనా

06



డీప్ ఫేక్ కోసం

## చాట్‌జీపీటీ సాయం

ఉత్తరకొరియా హ్యాకర్ల కొత్త పంథా

06



అమీర్‌పేట్, టోలీచౌక్

## పాస్‌పోర్టు కేంద్రాల మార్పు

- ఎంజీబీఎస్ మెట్రోకు మారిన అమీర్‌పేట్ కేంద్రం
- రాయదుర్గానికి మారిన టోలీచౌక్ కేంద్రం

03

### అర్హులైన జర్నలిస్టులందరికీ

# అక్రిడిటేషన్ కార్డులు

- అక్రిడిటేషన్ కార్డులపై విధివిధానాలు రూపొందించాం
- అధికారులతో సమీక్షలో మంత్రి పొంగులేటి ఆదేశం



**హైదరాబాద్, సెప్టెంబర్ 15 :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజాప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు అందేలా విధి విధానాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో హోంశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రవి గుప్తా, ప్రెస్ అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస రెడ్డి, ఐ అండ్ పీఆర్ స్పెషల్ కమిషనర్ సిహెచ్ ప్రియాంక, సీపీఆర్‌వో జి. మల్సూర్ తదితరులతో కలిసి సమీక్ష నిర్వహించారు.

03



### చిత్ర నిర్మాణ అనుమతులు

# ఇక మరింత సులువు

- సింగిల్ విండో ద్వారా అనుమతులకు వెబ్‌సైట్
- చిత్రప్రముఖులతో దిల్‌రాజ్ ప్రత్యేక వర్క్‌షాప్

**హైదరాబాద్, సెప్టెంబర్ 15 :** రాష్ట్రంలో సినిమాల చిత్రీకరణకు, సినిమాల చిత్రీకరణకు కావాల్సిన పలు అనుమతులు, సినిమా థియేటర్ల నిర్వహణకు పొందాల్సిన అనుమతులు, సినీ రంగాభివృద్ధికి కావాల్సిన అనుమతులు అన్నీ ఒకే విండో ద్వారా పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక వెబ్‌సైట్ రూపొందిస్తోంది. ఈ సులభతర అనుమతులపై రూపొందిస్తున్న ప్రత్యేక వెబ్‌సైట్‌పై సోమవారం సంబంధిత శాఖలు, ఫిలిం ఇండస్ట్రీ ప్రతినిధులతో ప్రత్యేక వర్క్‌షాప్ జరిగింది.

03



07

ఆవిష్కరణలను తుడిచిపెట్టే

## నిబంధనలు మనకొద్దు

ఏఐపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్

### నేటి అర్ధరాత్రి నుంచి

# ఆరోగ్యశ్రీ సేవల నిలిపివేత

## ప్రైవేటు ఆసుపత్రుల్లో బంద్ చేస్తున్నట్లు టీఏఎన్‌హెచ్‌ఏ ప్రకటన

**హైదరాబాద్, సెప్టెంబరు 15 :** రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం అర్ధరాత్రి నుంచి ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేస్తున్నట్లు తెలంగాణ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ (టీఏఎన్‌హెచ్‌ఏ) ప్రకటించింది. ఈ మేరకు 'టీఏఎన్‌హెచ్‌ఏ' రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వద్దిరాజు రాకేశ్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆరోగ్యశ్రీ కింద అనుసంధానమైన 323 ప్రైవేటు నెట్‌వర్క్ ఆసుపత్రులకు ప్రభుత్వం నుంచి పెద్దమొత్తంలో బకాయిలు రావాల్సి ఉందని, విధిలేని పరిస్థితుల్లో సేవలు నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులతో ఇటీవల జరిపిన చర్చల్లో రూ.140 కోట్ల బకాయిలు విడుదల చేస్తామని ఇచ్చిన హామీ మేరకు సోమవారం రూ.100 కోట్ల బకాయిలు విడుదల చేశామని, మరో రూ.40 కోట్లు త్వరలో విడుదల చేయనున్నామని వైద్య వర్గాలు వెల్లడించాయి. అయితే ప్రభుత్వం నుంచి తమకు సుమారు రూ.1,400 కోట్ల వరకు బకాయిలు రావాల్సి ఉందని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులు చెబుతున్నాయి.



పార్టీ మారిన పదిమందిపై

# వేటేయండి

- స్పీకర్‌ను కోరిన బీఆర్ఎస్ పార్టీ
- అదనపు కార్యదర్శికి ఆధారాలు సమర్పించిన జగదీశ్ రెడ్డి

03

### యూరియా వాడకం

# తగ్గించండి

- క్యాన్సర్‌కు అదే ప్రధాన కారణం
- యూరియా తగ్గిస్తే 800 నగదు ప్రోత్సాహకం
- కలెక్టర్ల సదస్సులో సిఎం చంద్రబాబు ప్రకటన

ఏపీ సీఎం చంద్రబాబు కీలక ప్రకటన చేశారు. వచ్చే ఏడాది నుంచి యూరియా వాడకం తగ్గించే రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. తగ్గించే ప్రతి కట్టకు రూ.800 నేరుగా రైతుకు అందిస్తామని చెప్పారు.



### చట్టవిరుద్ధంగా ఉంటే..

# 'ఎస్ఐఆర్'ను రద్దు చేస్తాం

## ఈసీకి 'సుప్రీం' హెచ్చరిక



బిహార్ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు ఎన్నికల కమిషన్ అనుసరించిన పద్ధతిలో ఏదైనా చట్టవిరుద్ధంగా కనిపిస్తే మొత్తం 'ఎస్ఐఆర్'ను రద్దు చేస్తామని సుప్రీం కోర్టు ఎన్నికల కమిషన్‌ను హెచ్చరించింది. అయితే రాజ్యాంగ సంస్థ అయిన ఎన్నికల సంఘం ఎన్నికల నిర్వహణలో సరైన నిబంధనలను పాటించిందని భావిస్తున్నట్లు పేర్కొంది.

06

# దెబ్బకు దిగొచ్చిన ట్రంప్..

## విదేశీ ఉద్యోగులను నియమించుకోండంటూ పోస్ట్



అమెరికా పరిశ్రమలలో విదేశీ ఉద్యోగుల అవసరం ఉందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. యూఎస్‌లో పెట్టుబడుల గురించి తాము ఆలోచిస్తామంటూ దక్షిణకొరియా నుంచి హెచ్చరికలు వచ్చిన నేపథ్యంలో అధ్యక్షుడు దెబ్బకు దిగొచ్చారు. సంక్లిష్టమైన ఉత్పత్తులను తయారు చేస్తోన్న విదేశీ కంపెనీలు అమెరికాలో భారీ పెట్టుబడులు పెట్టిన సమయంలో నైపుణ్యం కలిగిన కార్మికులు అవసరం అవుతుంటారు. కొంతకాలం నిపుణులైన కార్మికులను వారు మా దేశానికి తీసుకురావాలని నేను కోరుకుంటున్నాను అని ట్రంప్ ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు.

06



## మరో మూడ్రోజులు భారీ వర్షాలు

### వాతావరణశాఖ హెచ్చరిక

**హైదరాబాద్, సెప్టెంబరు 15:** తెలంగాణలో మరో మూడురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు పడే సూచనలున్నాయని చెప్పింది. మంగళవారం ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని.. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. బుధవారం సిద్దిపేట, రంగారాఎడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ, గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వానలు కురిసే అవకాశం ఉందని వివరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24గంటల్లో ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, రంగారెడ్డి, హైదరాబాద్, వరంగల్‌తో పాటు- పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట గ్రామంలో 24.5 సెంటీ-మీటర్ల వర్షపాతం నమోదైంది.

### కర్నూలులో ప్రైవేటు పాఠశాల

## గోడ కూలి విద్యార్థి మృతి

**కర్నూలు:** కర్నూలులో విషాద ఘటన చోటు చేసుకుంది. కవ్వాడి వీధిలోని ప్రైవేటు పాఠశాలలో గోడ కూలి ఓ విద్యార్థి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. స్థానికంగా ఉన్న ప్రైవేటు పాఠశాలలో రాఖీబ్ (5) ఒకటో తరగతి చదువుతున్నాడు. సోమవారం స్కూల్‌కు ఆలస్యంగా రావడంతో యాజమాన్యం రాఖీబ్‌తో పాటు మరో ఐదుగురు విద్యార్థులను కాంపౌండ్‌లో నిల్చోబెట్టింది. ఈ క్రమంలో ఒక్కసారిగా గోడ కూలడంతో రాఖీబ్ అక్కడిక్కడే మృతి చెందాడు. మరో ఐదుగురు విద్యార్థులకు గాయాలయ్యాయి. గాయపడిన విద్యార్థులను చికిత్స కోసం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. ప్రైవేటు పాఠశాలలో విద్యార్థి మృతిపై మంత్రి టీజీ భరత్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాలుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. స్కూల్ యాజమాన్యంతో మాట్లాడి బాలుడి కుటుంబానికి న్యాయం చేస్తామన్నారు.



## కొడంగల్‌లో సిఎం నివాసం ముట్టడికి యత్నం

**వికారాబాద్, సెప్టెంబరు 15:** వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి నివాసాన్ని ముట్టడించేందుకు యత్నించిన అంగన్వాడీ కార్యకర్తలు యత్నించారు. అయితే పోలీసులు అడ్డుకుని వీరిని అదుపులోకి తీసుకున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ జిల్లా నలుమూలల నుంచి 300 మంది అంగన్వాడీ కార్యకర్తలు.. సీఎం నివాసం ముట్టడి కోసం కొడంగల్ వచ్చారు. స్థానిక బస్టాండ్‌లో నిరసన తెలిపారు. అనంతరం సుమారు 40 మంది సీఎం ఇంటి ముట్టడికి యత్నించగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.



### వక్ఫ్ సవరణ చట్టంపై

## సుప్రీం కీలక ఆదేశాలు

- పలు సవరణల్లో ఆంక్షలు విధిస్తూ ఆదేశాలు
- చట్టసవరణను నిలిపివేయాలన్న పిటిషన్లపై విచారణ

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 15:** వక్ఫ్ సవరణచట్టం-2025 లో కీలక ప్రొవిజన్‌ను నిలిపివేస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కనీసం ఐదేళ్లపాటు- ఇస్లాంను అనుసరించిన వ్యక్తి మాత్రమే ఆస్తిని వక్ఫ్ చేయడానికి అవకాశం ఉంటుందన్న దానిని నిలిపివేసింది. ఒక వ్యక్తి ఇస్లాంను అనుసరిస్తున్నట్లు- నిర్ణయించేలా నిబంధనలు తయారుచేసేవరకు ఇది అమల్లో ఉండదని చెప్పింది. అదే సమయంలో వక్ఫ్(సవరణ)చట్టం-2025పై మొత్తంగా స్టే విధించడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. కొన్ని సెక్షన్లకు మాత్రం కొంత రక్షణ అవసరమని వ్యాఖ్యానించింది. వక్ఫ్ బోర్డులో ముస్లిం సభ్యుల సంఖ్య కచ్చితంగా మెజార్టీలో ఉండాలని కోర్టు పేర్కొంది. బోర్డ్ లేదా కౌన్సిల్‌లో అత్యధికంగా ముగ్గురు లేదా నలుగురు ముస్లిమేతర సభ్యులు ఉండాలని చెప్పింది. ఇక చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ముస్లిమే ఉండటం మంచిదని పేర్కొంది. ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ (సవరణ) చట్టం-2025ను పూర్తిగా నిలిపివేయాలని దాదాపు 100కు పైగా పిటిషన్లు సుప్రీంకోర్టులో దాఖలయ్యాయి. ముస్లింల ఆస్తిని మెల్లగా లాగేసుకొనేందుకే అని వీటిల్లో ఆరోపించాయి. ఇక కేంద్రం మాత్రం పబ్లిక్, ప్రైవేటు- ఆక్రణలకు గురికాకుండా రక్షించడానికి అని వాదించింది. వాస్తవానికి ఈ కేసు ఏప్రిల్‌లో పార్లమెంట్ ఈ బిల్లును క్లియర్ చేసిన గంటల్లోనే సుప్రీంకోర్టుకు చేరింది. ముఖ్యంగా కోర్టులతో వక్ఫ్ ఆస్తిగా గుర్తించినవి, వ్యక్తులు, డీడ్ల ఆధారంగా వక్ఫ్ అయిన ఆస్తుల డీనోటిఫై అధికారాలను దీనిలో ప్రశ్నించారు.

# పకడ్బందీగా వీధి దీపాల నిర్వహణ

- సోలార్ పవర్‌పై సాధ్యాసాధ్యాల పరిశీలన
- ఐఐటి సంస్థలతో ఆడిటింగ్ జరిపేలా చర్యలు
- పెద్ద కంపెనీల నుంచి టెండర్ల ఆహ్వానం
- అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ ఆదేశం



**హైదరాబాద్, సెప్టెంబరు 15:** వీధి దీపాల నిర్వహణ కోసం పెద్ద కంపెనీల నుంచి వెంటనే టెండర్లు పిలవాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. సోమవారం బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మున్సిపల్, పంచాయతీ రాజ్, జీహెచ్ఎంసీ అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారులకు పలు అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. వీధి దీపాలకు సోలార్ పవర్‌ను వినియోగించడంపై సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సూచించారు. ఐఐటీ లాంటి సంస్థలతో థర్డ్ పార్టీ ఆడిట్ చేయించాలని మార్గనిర్దేశం చేశారు. రాష్ట్రంలోని అన్ని వీధి దీపాలను కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం చేయాలని ఆదేశించారు. ఏఐతో ఎప్పటికప్పుడు విశ్లేషణ చేయాలని సూచించారు. గ్రామాల్లో వీధి దీపాల నిర్వహణను గ్రామ పంచాయతీకి అప్పగించాలని మార్గనిర్దేశం చేశారు. రాష్ట్రంలో వీధి దీపాల ఏర్పాటు, నిర్వహణలో సమూల మార్పులు తీసుకురావాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారు వేమ నరేందర్‌రెడ్డి, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్, పంచాయతీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్. శ్రీధర్, మున్సిపల్ శాఖ కార్యదర్శి శ్రీదేవి, కోర్ అర్బన్ ఏరియా మున్సిపల్ సెక్రటరీ ఇలంబర్తి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌తో పాటు అనేక ఉన్నతాధికారులు పాల్గొన్నారు.
సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో వీధి దీపాల ఏర్పాటు, నిర్వహణ కోసం పెద్ద కంపెనీల నుండి టెండర్లను పిలవాలని సూచించారు. దీనివల్ల పారదర్శకత పెరిగి, సేవల నాణ్యత మెరుగుపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. అలాగే, వీధి దీపాల కోసం సౌరశక్తి వినియోగం సాధ్యాసాధ్యాలను లోతుగా పరిశీలించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. వీధి దీపాల పనితీరును నిర్ధారించడానికి ఐఐటీ వంటి ప్రతిష్టాత్మక సంస్థలతో థర్డ్ పార్టీ ఆడిట్ చేయాలని సీఎం ఆదేశించారు. అంతేకాకుండా, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని వీధి దీపాలను కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం చేసి, కేంద్రంగా పర్యవేక్షించే విధానాన్ని రూపొందించాలని సూచించారు. దీని ద్వారా ప్రతి దీపం స్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. వీధి దీపాల నిర్వహణలో ఆధునిక సాంకేతికతను ఉపయోగించాలని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. కృత్రిమ మేధస్సు ద్వారా ఎప్పటికప్పుడు విశ్లేషణ జరిపి, సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కారాలు తీసుకోవాలని సూచించారు. సీఎం రేవంత్ ప్రకారం, గ్రామీణ ప్రాంతాల్లో వీధి దీపాల నిర్వహణను పూర్తిగా గ్రామ పంచాయతీలకే అప్పగించాలని నిర్ణయించారు. సర్పంచ్‌లకు దీపాల ఏర్పాటు, నిర్వహణపై పూర్తి అధికారం ఇవ్వబడుతుంది. అయితే, ఈ పనులపై ఎంపీడీవో స్థాయిలో పర్యవేక్షణ ఉండాలని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఉన్న ప్రతి వీధి దీపం, ప్రతి పోల్‌పై సర్వే చేయాలని సీఎం ఆదేశించారు. దీని ద్వారా సమస్యలు, లోపాలు, అదనపు అవసరాలను గుర్తించి త్వరితగతిన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. వీధి దీపాల వ్యవస్థను ఆధునీకరించడానికి తీసుకుంటున్న ఈ చర్యలు రాబోయే రోజుల్లో రాష్ట్రానికి ఒక మోడల్‌గా నిలుస్తాయని సీఎం రేవంత్ అభిప్రాయపడ్డారు. పారదర్శక విధానాలు, సాంకేతిక ఆధారిత పర్యవేక్షణ, గ్రామీణ స్థాయి అధికారికి బాధ్యత కల్పించడం ద్వారా వీధి దీపాల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించగలమన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

## వృత్తి కాలేజీల బంద్

- ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై సర్కార్ పరిశీలన
- సీఎం రేవంత్‌తో భట్టి, శ్రీధర్ బాబుల సమీక్ష

**హైదరాబాద్, సెప్టెంబర్ 15:** ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై కాలేజీ యాజమాన్యాల తీరుపై ప్రభుత్వం ఆగ్రహంగా ఉంది. కాలేజీల బంద్ నేపథ్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు సీఎం రేవంత్‌తో చర్చించారు. ఈ క్రమంలో తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపు అంశం మరోసారి హాట్‌టాపిక్‌గా మారింది. ఈ విషయంలో సీఎం ఏ. రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు కలిసి కీలకంగా చర్చించారు. ప్రభుత్వానికి అందిన సమాచారం ప్రకారం, గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాలంలో సిద్ధమైన విజిలెన్స్ రిపోర్ట్‌ను తిరిగి పరిశీలించాలని నిర్ణయం తీసుకున్నారు. ఆ రిపోర్ట్‌లో అనేక ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీలు నాణ్యతా ప్రమాణాలను పాటించకుండా, విద్యార్థులకు సౌకర్యాలు కల్పించకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని లాభాల కోసం వినియోగించుకున్నట్లు స్పష్టంగా తేలినట్లు తెలుస్తోంది. విద్యార్థి సంఘాలు కూడా ఈ రిపోర్ట్‌ను వెంటనే బహిర్గతం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. కాలేజీలు విద్యా ప్రమాణాలను విస్మరించి, బకాయిల చెల్లింపుల పేరుతో ప్రభుత్వాన్ని బ్లాక్‌మెయిల్ చేస్తున్నాయంటూ విద్యార్థి సంఘాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. నకిలీ సిబ్బందిని చూపించి అనుమతులు పొందడం, సౌకర్యాలు కల్పించకుండా కోట్లు దాచుకోవడం, తనిఖీలు తూతూ మంత్రంగానే జరగడం వంటి అంశాలను వారు ప్రస్తావిస్తున్నారు. అంతేకాకుండా, కోట్ల రూపాయల నిధులు కాలేజీ యాజమాన్యాల మధ్య చేతులు మారుతున్నాయంటూ ఆరోపణలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం విజిలెన్స్ రిపోర్ట్‌ను సమగ్రంగా పరిశీలించేందుకు సిద్ధమవుతోంది. అవసరమైతే అక్రమాలకు పాల్పడిన కాలేజీలపై కఠిన చర్యలు తీసుకోవచ్చని సంకేతాలు ఇస్తోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపుల చర్చలు ఈసారి ఎటువంటి నిర్ణయానికి దారితీస్తాయో విద్యార్థులు, కాలేజీలు, తల్లిదండ్రులు ఆసక్తిగా గమనిస్తున్నారు.



### ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్‌ను ప్రభుత్వం

## ఇష్టారీతిన మారుస్తోంది

### మాజీ మంత్రి హరీశ్‌రావు

**హైదరాబాద్, సెప్టెంబర్ 15:** రీజినల్ రింగ్‌రోడ్డు (ఆర్ఆర్ ఆర్) కోసం అలైన్ మెంట్ ను కాంగ్రెస్ ప్రభుత్వం ఇష్టారీతిన మారుస్తోందని, రైతులు తమ భూములు కోల్పోకుండా నిలదీస్తామని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ రైతులు హరీశ్‌రావును కలిశారు. ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్ మార్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. అలైన్‌మెంట్ మార్చి పేద రైతుల పొట్ట కొట్టడం దుర్మార్గమన్నారు. కాంగ్రెస్ అనాలోచిత చర్యల వల్ల రైతులు భూములు కోల్పోయే పరిస్థితి ఉందన్నారు. "సీఎం సొంత భూములకు మేలు కలిగేలా అలైన్‌మెంట్ మార్చడం దుర్మార్గం. రైతుల ఆవేదన సీఎం రేవంత్‌రెడ్డికి అర్థం కావడం లేదా? అలైన్‌మెంట్ మార్పుతో కేంద్రం ఆర్ఆర్ఆర్‌ను తిరస్కరించే పరిస్థితి ఉంది. సమస్యను పరిష్కరించే వరకు భారత రాష్ట్ర సమితి పోరాటం చేస్తుంది" అని హరీశ్‌రావు తెలిపారు.

## ఫీజు బకాయిల పాపం బిఆర్ఎస్‌దే

- నాలుగేళ్ల పాటు చెల్లించకుండా పెండింగ్
- మండిపడ్డ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**హైదరాబాద్, సెప్టెంబరు 15:** విద్యార్థులకు ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిల పాపం ముమ్మాటికీ బిఆర్ఎస్‌దేనని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం నాలుగేళ్ల పాటు- ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించలేదని విమర్శించారు. నాలుగేళ్లు పెండింగ్‌లో ఉంచడం వల్లే ఇప్పుడు ప్రభుత్వంపై భారం పెరిగిందని తెలిపారు. ఫీజులు ఎందుకు చెల్లించలేదో చెప్పాలన్నారు. ఇవన్నీపక్కనెట్టి బురద జల్లుతున్నారని మండిపడ్డారు. పల్లెల్లోనే కాదు.. పట్టణాల్లోనూ భారత రాష్ట్రసమితికి ప్రజల ఆదరణ లేదన్నారు. దుర్గం చెరువుపై కేబుల్ బ్రిడ్జి నిర్మాణం తప్ప.. తెలంగాణకు ఆ పార్టీ చేసిందేమీ లేదని ఆక్షేపించారు. కేటీఆర్ భాష, సంస్కృతి బాగాలేదని.. సీఎంపై వ్యక్తిగత దూషణలు సరికాదన్నారు. యూరియా విషయంలో భారత రాష్ట్ర సమితి దుష్ప్రచారం చేస్తోందని ఆది శ్రీనివాస్ మండిపడ్డారు. సరిపడా యూరియాను ఇవ్వని కేంద్రాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. రైతుల పక్షాన మోదీని, కేంద్రాన్ని భారత రాష్ట్ర సమితి నేతలు ఎందుకు నిలదీయడంలేదని ప్రశ్నించారు. అవినీతి కేసుల్లో ఇరుక్కున్న ఆ పార్టీ నేతలు భాజపాకు భయపడుతున్నారని ఆరోపించారు. కేంద్రాన్ని ప్రశ్నిస్తే.. కేసులు బిగుసుకుంటాయని భారత రాష్ట్ర సమితిలో భయం పట్టుకుందని వ్యాఖ్యానించారు.

## బండి సంజయ్‌పై కేటీఆర్ పరువునష్టం దావా

**హైదరాబాద్, సెప్టెంబరు 15:** కేంద్రమంత్రి బండి సంజయ్‌పై పై భారత రాష్ట్రసమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ వేసిన పరువు నష్టం పిటిషన్‌పై కోర్టులో విచారణ జరిగింది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బండి సంజయ్ నిరాధార వ్యాఖ్యలు చేశారని పేర్కొంటూ కేటీ-ఆర్ ఇటీవల పిటిషన్ వేశారు. తనకు బహిరంగ క్షమాపణతో పాటు- రూ.10 కోట్లు- చెల్లించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై సిటీ సివిల్ కోర్టు సోమవారం విచారణ జరిపింది. డిసెంబర్ 15న ఈ కేసు విచారణకు హాజరు కావాలని బండి సంజయ్‌కు సమన్లు జారీ చేసింది.



### తిరుమ శ్రీవారిని

## దర్శించుకున్న మారిషస్ ప్రధాని

### నవీన్ చంద్ర దంపతులకు టిటిడి ఘనస్వాగతం

**తిరుమల, సెప్టెంబరు 15:** భారత్ పర్యటనలో ఉన్న మారిషస్ ప్రధాని నవీన్ చంద్ర సోమవారం సాయంత్రం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. తొలుత తిరుమల చేరుకున్న ఆయనకు పద్మావతి అతిథి గృహం వద్ద తితిదే అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన తన సతీమణితో కలిసి కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీనివాసుడిని దర్శించుకున్నారు. మారిషస్ ప్రధాని వెంట మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఉన్నారు. సెప్టెంబర్ 9న భారత్ పర్యటనకు విచ్చేసిన మారిషస్ ప్రధాని నవీన్‌చంద్ర.. సెప్టెంబర్ 11న ప్రధాని నరేంద్ర మోదీతో వారణాసిలో భేటీ అయిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా భారత సంతతి ప్రజలు అధికంగా ఉండే మారిషస్‌కు మన దేశం రూ.5,984 కోట్ల ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని ప్రకటించింది. దీంతో పాటు- తీర ప్రాంత భద్రత వంటి 7 కీలక ఒప్పందాలను ఆ దేశంతో కుదుర్చుకుంది. భారత్‌లో నవీన్ చంద్ర పర్యటన ఈ నెల 16తో ముగియనుంది.



### కడియం శ్రీహరి వెంటనే

## రాజీనామా చేయాలి

### మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ డిమాండ్

**హన్మకొండ, సెప్టెంబరు 15:** ఎమ్మెల్యే కడియం శ్రీహరికి నీతి ఉంటే రాజీనామా చేయాలి అని మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో పాదయాత్ర చేస్తున్న మాజీ శాసనసభ్యుడు తాటికొండ రాజయ్యను సోమవారం హనుమకొండలోని వారి ఇంటి వద్ద అక్రమ అరెస్ట్ హౌస్ అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో వినయ్ భాస్కర్ తాటికొండ రాజయ్యను ఇంటికి వెళ్లి కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..బీఆర్ఎస్ పార్టీ, కారు గుర్తు పై గెలిచిన కడియం శ్రీహరి పార్టీ మారడం ఏ విలువలకు నిదర్శనమని ప్రశ్నించారు. ఏ మాత్రం నైతికత ఉన్నా కడియం శ్రీహరి రాజీనామా చేసి మళ్లీ ఎన్నికల్లో పోటీ- చేయాలని డిమాండ్ చేశారు. కేవలం కడియం శ్రీహరి రాజకీయ పబ్బం గడుపుకునేందుకే పార్టీ మారాడని, నీతి వాక్యాలు వల్లించే కడియం శ్రీహరి అవినీతి చక్రవర్తి అని విమర్శించారు. బిడ్డ రాజకీయ భవిష్యత్తు కోసం అవకాశమిచ్చి ఆదరించిన కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీకి వెన్నుపోటు పొడిచారని మండిపడ్డారు. కడియం శ్రీహరి ఏ పార్టీలో ఉన్నారన్న విషయంపై ఆయన మాట్లాడుతున్న తీరు ఊసరవెల్లిని మించుతోందని ఎద్దేవా చేశారు. రాజన్న పాదయాత్రకు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకనే హౌస్ అరెస్ట్ చేశారని అన్నారు. ఉప ఎన్నికలు వస్తే స్టేషన్ ఘన్‌పూర్ గడ్డపై గులాబీ జెండా ఖచ్చితంగా ఎగురుతుందని అన్నారు. కడియం శ్రీహరి బూటకపు ఎన్కౌంటర్లు చేసిన నరరూప రాక్షసుడు అని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందని, ప్రజలు కేసీఆర్, బీఆర్ఎస్ పాలనను కోరుకుంటు-న్నారని అన్నారు.

## ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలతో ప్రభుత్వం చర్చలు సఫలం

**హైదరాబాద్:** తెలంగాణలోని వృత్తి విద్యా కళాశాలల యాజమాన్యాలతో ప్రభుత్వం జరిపిన చర్చలు సఫలమయ్యాయి. దీపావళిలోగా రూ.1200 కోట్ల బకాయిలు విడుదల చేసేందుకు ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఫీజురియింబర్స్‌మెంట్ అంశంపై మంత్రులు భట్టివిక్రమార్క, శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రైవేటు కళాశాలల యాజమాన్యాల ప్రతినిధులతో జరిపిన చర్చలు ముగిశాయి. చర్చలు సఫలం కావడంతో తరగతుల బంద్‌ను ఉపసంహరించుకున్నట్లు వృత్తి విద్యా కళాశాలల యాజమాన్యాలు ప్రకటించాయి. దీంతో మంగళవారం నుంచి తరగతులు యథాతథంగా కొనసాగనున్నాయి.

### ఫీజురియింబర్స్‌మెంట్ రేషనలైజేషన్‌కు కమిటీ : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడుతూ.. "విద్యార్థుల భవిష్యత్తు తెలంగాణ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యతతో కూడిన అంశం. ఫీజు రియింబర్స్‌మెంట్ పథకం పేద, మధ్యతరగతి విద్యార్థులకు వరంలాంటిది. గత భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం ఫీజు రియింబర్స్‌మెంట్ పథకాన్ని ఛిన్నాభిన్నం చేసింది. పదేళ్ల పాటు ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులను పెండిగ్‌లో పెట్టి భారంగా మార్చింది. వారు విధ్వంసం చేసిన అంశాలను మేం క్రమక్రమంగా సరిదిద్దుతున్నాం. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ఫీజురియింబర్స్‌మెంట్ సమస్యను కూడా పరిష్కరిస్తాం. ఈ పథకానికి సంబంధించి కళాశాలల వద్ద రూ.600 కోట్ల విలువైన టోకెన్లు ఉన్నాయి. ఇప్పటికే టోకెన్లు ఇచ్చిన రూ.600 కోట్ల నిధులు ఈ వారంలోనే విడుదల చేస్తామని హామీ ఇచ్చాం. ఫీజు రియింబర్స్‌మెంట్ రేషనలైజేషన్ కోసం ఒక కమిటీ వేయాలని నిర్ణయించాం. మా విజ్ఞప్తి మేరకు కళాశాలల బంద్‌ను విరమించుకున్నట్లు యాజమాన్యాలు చెప్పాయి. బంద్ విరమణకు ముందుకొచ్చిన యాజమాన్యాలకు ధన్యవాదాలు" అని తెలిపారు.



# నాలాల కబ్జా వల్లనే ప్రమాదాలు

- కొట్టుకుపోయిన ఇద్దరికి రూ.5 లక్షల చొప్పున పరిహారం
- నగరంలో అనేక చోట్ల ఇలాంటి కబ్జాల వల్లే ప్రమాదాలు
- మాంగర్‌బస్తీలో రంగనాథ్, కలెక్టర్ హరిచందన పర్యటన



**హైదరాబాద్, సెప్టెంబర్ 15 :** భారీ వర్షం నేపథ్యంలో ఆదివారం రాత్రి అఫ్జల్ సాగర్‌లో ఇద్దరు గల్లంతయ్యారని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. నాలాల కబ్జాల వల్లే వరద సమయంలో ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఒక నిర్మాణం కారణంగా నాలాలో వరదనీరు అడ్డుపడిందని తెలిపారు. అఫ్జల్ సాగర్ వద్ద కొన్ని ఇళ్లను తొలగించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే ముగ్గురు గల్లంతయ్యారు, అందులో ఇద్దరు మృతిచెందారని తెలిపారు. అన్ని సమస్యల పరిష్కారానికి హైడ్రా కృషి చేస్తోందని పేర్కొన్నారు. అఫ్జల్ సాగర్ డ్రెయినేజీలో గల్లంతైన ఇద్దరికి రూ.5 లక్షల చొప్పున పరిహారం అందించనున్నట్లు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన ప్రకటించారు. గల్లంతైన వారి ఆచూకీ ఇంకా లభించలేదన్నారు. పాత ఇళ్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలని ఆమె సూచించారు. కొన్ని నాలాలపై నిర్మాణాలు ఉండటం వల్ల అందరికీ ప్రమాదమని హెచ్చరించారు. అఫ్జల్ సాగర్ పరిధిలో ఉన్నవారికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వనున్నట్లు కూడా ఆమె తెలిపారు. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షాలతో హైదరాబాద్ వణికిపోయింది. అకస్మాత్తుగా కురిసిన కుండపోత వాన కారణంగా నగరంలోని అనేక ప్రాంతాలు మునిగిపోయాయి. ఫ్లాష్ ఫ్లడ్స్ కారణంగా రోడ్లు, కాలనీలు వరద నీటితో నిండిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆసిఫ్‌నగర్‌లోని మాంగర్‌బస్తీ ప్రాంతం అతలాకుతలమైంది. వరద నీటికి ఇద్దరు కొట్టుకుపోవడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా కలెక్టర్ హరిచందన, హైడ్రా కమిషనర్ రంగనాథ్ తక్షణమే రంగంలోకి దిగారు. మాంగర్‌బస్తీ ప్రాంతాన్ని ప్రత్యక్షంగా సందర్శించి అక్కడి పరిస్థితిని సమీక్షించారు. ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను తెలుసుకొని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు మరల జరగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. దీనికి సంబంధించిన స్పష్టమైన యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మాంగర్‌బస్తీ మాత్రమే కాక, నగరంలోని అనేక ప్రాంతాల్లో నాలాలు కబ్జా అయినట్లు తెలిపారు. అలాంటి కబ్జాల వల్లే ఫ్లాష్ ఫ్లడ్స్ రూపంలో విపత్తులు సంభవిస్తున్నాయని గుర్తుచేశారు. "మాంగర్‌బస్తీ ఘటన మళ్లీ పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవడమే హైడ్రా ప్రధాన లక్ష్యం" అని అన్నారు. హైదరాబాద్‌లో హైడ్రా వ్యవస్థ ప్రాధాన్యత ప్రజలకు ఇప్పుడు బాగా అర్థమవుతోందని రంగనాథ్ తెలిపారు. ఈ మోడల్‌ను చూసి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో కూడా హైడ్రా తరహా వ్యవస్థ అవసరం ఉందని డిమాండ్ వస్తోందన్నారు. మాంగర్‌బస్తీ పరిస్థితిపై జిల్లా కలెక్టర్ హరిచందన మాట్లాడుతూ, ఆ ప్రాంతంలో 145 ఇళ్లు నాలాలపై నిర్మించబడ్డాయని తెలిపారు. స్థానికులు ముందుకు వస్తే వారికి ప్రభుత్వ పథకాల ద్వారా అందించే ఇందిరమ్మ ఇళ్లకు తరలిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా తక్షణ చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ కూడా స్పందిస్తూ, మాంగర్‌బస్తీ సమస్యకు వారంరోజుల్లో పరిష్కారం చూపుతామని చెప్పారు. నాలాకు అడ్డుగా ఉన్న నాలుగైదు ఇళ్లను తొలగిస్తామని స్పష్టం చేశారు. అయితే అన్ని ఇళ్లను తొలగిస్తారని భయపడాల్సిన అవసరం లేదని, ప్రజల ఇళ్లను కూల్చే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. మాంగర్‌బస్తీ ఘటనతో ప్రభుత్వం యంత్రాంగం చురుకైంది. నాలాల కబ్జాలు, అనధికార నిర్మాణాలు, వర్షాకాలంలో పునరావృతమయ్యే వరద సమస్యలపై సమగ్ర చర్యలు తీసుకోవాలని అధికారులు తేల్చుకున్నారు. వచ్చే వారాల్లో స్పష్టమైన చర్యలు అమలులోకి వస్తాయని, ప్రజలు నమ్మకంగా ఉండాలని సూచించారు.



## అర్హులైన జర్నలిస్టులందరికి అక్రిడిటేషన్ కార్డులు

- అక్రిడిటేషన్ కార్డులపై విధివిధానాలు రూపొందించాం
- అధికారులతో సమీక్షలో మంత్రి పొంగులేటి ఆదేశం

**హైదరాబాద్, సెప్టెంబర్ 15 :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజాప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు అందేలా విధి విధానాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో హోంశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రవి గుప్తా, ప్రెస్ అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస రెడ్డి, ఐ అండ్ పీఆర్ స్పెషల్ కమిషనర్ చిహెచ్ ప్రియాంక, సీపీఆర్‌వో జి. మల్సూర్ తదితరులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా అక్రిడిటేషన్ పాలసీ, జర్నలిస్టుల హెల్త్ పాలసీ, జర్నలిస్టుల అవార్డులు, జర్నలిస్టులపై దాడులపై హైపవర్ కమిటీ తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, "జర్నలిస్టులపై దాడులు జరగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం హైపవర్ కమిటీని పునరుద్ధరించేందుకు నిర్ణయం తీసుకున్నాం" అని చెప్పారు. ఇందుకు సంబంధించిన జీఓను 2008లో ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసినప్పటికీ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత దానిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. అలాగే జర్నలిస్టుల జీతభత్యాలకు సంబంధించి త్రైప్రాసిక కమిటీని కూడా పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు. జర్నలిస్టుల హెల్త్ పాలసీపై సమగ్రంగా చర్చించామని, ఇన్సూరెన్స్ పాలసీలో ఏమి జర్నలిస్టులకు ప్రయోజనకరంగా ఉంటుందన్న అంశంపై ఆరోగ్యశ్రీ విభాగంతో కలిసి లోతైన అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. అక్రిడిటేషన్ పాలసీపై కూడా సుదీర్ఘంగా చర్చించారు. జర్నలిస్టుల నుండి దరఖాస్తులు స్వీకరించేం దుకు ప్రత్యేక వెబ్‌సైట్‌ను తక్షణమే రూపొందించాలని అధికారులను ఆదేశించా రు. జర్నలిస్టులకు అవార్డులను పునరుద్ధరించాలని ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస రెడ్డి చేసిన విజ్ఞప్తికి మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో ఆరోగ్యశ్రీ సీఈఓ ఉదయ్ కుమార్, కార్మిక శాఖ అడిషనల్ కమిషనర్ గంగాధర్ పాల్గొన్నారు.




## అమీర్‌పేట్, టోలీచౌక్ పాస్‌పోర్టు కేంద్రాల మార్పు

- ఎంజీబీఎస్ మెట్రోకు మారిన అమీర్‌పేట్ కేంద్రం
- రాయదుర్గానికి మారిన టోలీచౌక్ కేంద్రం

**హైదరాబాద్, సెప్టెంబర్ 15 :** నగరంలోని రెండు పాస్‌పోర్టు కార్యాలయాల చిరునామాలు మరియు పేర్లు మారాయి. అమీర్‌పేట్, టోలీచౌక్ పాస్‌పోర్టు కార్యాలయాలను ఇతర ప్రదేశాలకు మార్చారు. ఈ రెండు కార్యాలయాలు మంగళవారం నుండి కొత్త ప్రాంగణాల్లో పనిచేస్తాయని పాస్‌పోర్టు అధికారులు తెలిపారు. హైదరాబాద్ నగరంలోని ఈ రెండు పాస్‌పోర్టు సేవా కేంద్రాలు, ప్రస్తుతం ఉన్న ప్రదేశాల నుండి వేరే ప్రదేశాలకు తరలించబడ్డాయి. అమీర్‌పేట్, టోలీచౌక్ ప్రాంతాల్లో ఉన్న పాస్‌పోర్టు సేవా కేంద్రాలు కొత్త ప్రదేశాలకు మార్చబడ్డాయి. సెప్టెంబర్ 16 నుండి, అమీర్‌పేట్‌లోని ఆదిత్య ట్రేడ్ సెంటర్ పాస్‌పోర్టు కేంద్రం ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్ వద్దకు తరలించబడింది. అదే విధంగా, టోలీచౌక్‌లోని షేక్‌పేట్ నాలా వద్ద ఉన్న ఆనంద్ సిలికాన్ చిప్ పాస్‌పోర్టు సేవా కేంద్రం పాత ముంబై రోడ్డులోని రాయదుర్గం ప్రాంతంలోని సిరి బిల్డింగ్‌కు మార్చబడింది. ఈ కేంద్రాలు మంగళవారం నుండి తమ తమ కొత్త చిరునామాల్లో సేవలు అందించనున్నట్లు విదేశీ వ్యవహారాల శాఖ తెలిపింది.

## పార్టీ మారిన పదిమందిపై వేటేయండి

- స్పీకర్‌ను కోరిన బీఆర్ఎస్ పార్టీ
- అదనపు కార్యదర్శికి ఆధారాలు సమర్పించిన జగదీశ్ రెడ్డి



**హైదరాబాద్, సెప్టెంబర్ 15 :** పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని స్పీకర్‌ను కోరినట్లు బీఆర్ఎస్ నేత జగదీశ్ రెడ్డి మీడియాతో తెలిపారు. శాసనసభ ప్రాంగణానికి వెళ్లిన ఆ పార్టీకి చెందిన పలువురు ఎమ్మెల్యేలు శాసనసభ అదనపు కార్యదర్శి ఉపేందర్ రెడ్డిని కలిశారు. తమ పార్టీ నుంచి 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరినట్లు ఆధారాలు సమర్పించారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన వారిపై మూడు నెలల్లోపు నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు చెప్పిందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఇచ్చిన వివరణను అధికారులు మాకు తెలియజేశారని తెలిపారు. వారి వివరణపై భారత రాష్ట్ర సమితి పార్టీ నిర్ణయం చెప్పాలని మాకు మూడు రోజులు గడువు ఇచ్చారని అన్నారు. "మేము సుప్రీంకోర్టుకు వెళ్ళడంతో, ఎమ్మెల్యేల అనర్హతపై మూడు నెలల్లోపు నిర్ణయం తీసుకోవాలని కోర్టు తీర్పు ఇచ్చింది. స్పీకర్ పదిమంది ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేశారు. దాంతో కొంతమంది ఎమ్మెల్యేలు 'మేము అమాయకులం, కేసీఆర్‌పైన నమ్మకం ఉంది' అని స్పీకర్‌కు వివరణ ఇచ్చారు. దాంతో స్పీకర్, పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఇచ్చిన సమాధానాన్ని మాకు పంపుతూ మూడు రోజుల్లో మేము సమాధానం ఇవ్వాలని కోరారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు ఎక్కువ సమయం ఇచ్చిన స్పీకర్ మాకు మాత్రం మూడు రోజులే సమయం ఇచ్చారు. అయినా మేము ఆ గడువులోనే సమాధానం ఇచ్చాము" అని చెప్పారు. "మేము పార్టీ మారలేదని, సీఎం దగ్గరకు వెళ్ళితే మా మెడలో మూడు రంగుల కండువా కప్పారని పార్టీ మారిన ఎమ్మెల్యేలు అమాయకంగా చెప్పారు. వారు తమ అమాయకత్వాన్ని నిరూపించుకునే ప్రయత్నం చేశారు. కానీ కాంగ్రెస్ పార్టీ సభలు, సమావేశాల్లో పదిమంది ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 'కాంగ్రెస్ జెండా ఎగురవేద్దాం' అని పోచారం శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. పోచారం మాటలను ఏఐ ద్వారా మార్ఫింగ్ చేశారా? నా నియోజకవర్గంలో సమస్యలు ఉన్నాయంటే సీఎం మా ఇంటికి వచ్చారని పోచారం చెప్పారు. ఆయనకు కేసీఆర్‌పై నమ్మకం ఉంటే, కేసీఆర్ ఫోటో, కేసీఆర్ కండువా ఉండాలి కదా? అభివృద్ధి కోసం సీఎంను కలిసిన పోచారం శ్రీనివాస్ రెడ్డి... అయినా రాహుల్ గాంధీ, మహేష్ కుమార్ గౌడ్‌లను ఎందుకు కలిశారని ప్రశ్నించారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ 'నేను నియోజకవర్గ అభివృద్ధి కోసం వెళ్తే సడెన్‌గా సీఎం కండువా కప్పారని' చెప్పారు. అయితే సంజయ్ పేపర్ ప్రకటనల్లో కాంగ్రెస్ నేతలు ఎందుకు ఉన్నారు? గాంధీ భవన్, కాంగ్రెస్ పార్టీ మీటింగ్స్‌లో పాల్గొంటే అభివృద్ధి ఎలా జరుగుతుంది? వ్యక్తిగత ప్రయోజనాల కోసం పదిమంది ఎమ్మెల్యేలు పార్టీ మారారు. మేము తప్పు చేసి పార్టీ మారామని నియోజకవర్గ ప్రజల ముందు ఒప్పుకోవాలి. మేము పార్టీ మారలేదని కేసీఆర్ దగ్గర పిటిషన్ పెట్టుకోండి. నోటీసులు వచ్చాక కేసీఆర్ దగ్గరకు రావాల్సిన ఎమ్మెల్యేలు రేవంత్ రెడ్డి దగ్గరకు ఎందుకు వెళ్లారు? ఎన్ని చేసినా పదిమంది ఎమ్మెల్యేలు తప్పించుకోలేరు. వాళ్లు దొరికిపోయిన దొంగలు. సీఎం రేవంత్ రెడ్డి మూటలతో దొరికి తప్పించుకున్నారు. మేము తప్పించుకోలేమా అని ఎమ్మెల్యేలు అనుకుంటున్నారు. పార్టీ ఫిరాయింపుల చట్టం తెచ్చిందే కాంగ్రెస్ పార్టీ. పదిమంది ఎమ్మెల్యేలు ఇక్కడ తప్పించుకున్నా కోర్టు ముందు తప్పించు కోలేరు" అని అన్నారు. ఉప ఎన్నికలు రావడం ఖాయం. వీరికి రాజకీ య భవిష్యత్తు లేకుండా ప్రజలు చేయడం ఖాయం. కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ విదేశాల్లో ఉండటంతో, ఆయన వచ్చాక స్పీకర్‌కు ఆధారాలు సమర్పిస్తారు. కోర్టు ఇచ్చిన గడువులోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలి. కోర్టు గడువు ఉన్నందున ఎక్కువ సమయం లేదని, మూడు రోజుల్లో సమాధానం చెప్పాలని స్పీకర్ మమ్మల్ని కోరారని తెలిపారు. బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి ఫోటోలను మీడియా మార్ఫింగ్ చేసిందా...? బండ్ల కృష్ణమోహన్ రెడ్డి పార్టీ మారారని మీడియాలో వచ్చింది కదా...? ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సికింద్రాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసినా ఇప్పటివరకు స్పీకర్ నిర్ణయం తీసుకోలేదని చెప్పారు.



## చిత్ర నిర్మాణ అనుమతులు ఇక మరింత సులువు

- సింగిల్ విండో ద్వారా అనుమతులకు వెబ్‌సైట్
- చిత్రప్రముఖులతో దిల్‌రాజ్ ప్రత్యేక వర్క్‌షాప్

**హైదరాబాద్, సెప్టెంబర్ 15 :** రాష్ట్రంలో సినిమాల చిత్రీకరణకు, సినిమాల చిత్రీకరణకు కావాల్సిన పలు అనుమతులు, సినిమా థియేటర్ల నిర్వహణకు పొందాల్సిన అనుమతులు, సినీ రంగాభివృద్ధికి కావాల్సిన అనుమతులు అన్నీ ఒకే విండో ద్వారా పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక వెబ్‌సైట్ రూపొందిస్తోంది. ఈ సులభతర అనుమతులపై రూపొందిస్తున్న ప్రత్యేక వెబ్‌సైట్‌పై సోమవారం సంబంధిత శాఖలు, ఫిలిం ఇండస్ట్రీ ప్రతినిధులతో ప్రత్యేక వర్క్‌షాప్ జరిగింది. బేగంపేట్ టూరిజం ప్లాజాలో జరిగిన ఈ వర్క్‌షాప్‌కు తెలంగాణా ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్‌రాజు, తెలంగాణ ఎఫ్.డీ.సీ. మేనేజింగ్ డైరెక్టర్ సి.హెచ్. ప్రియాంక, టూరిజం కార్పొరేషన్ ఎం.డీ వల్లూరు క్రాంతిలతోపాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు, రాష్ట్ర చలన చిత్ర పరిశ్రమ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎఫ్.డీ.సీ. చైర్మన్ దిల్ రాజు మాట్లాడుతూ, రాష్ట్రంలో సినీ పరిశ్రమ అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని రకాల చేయూతలు చేస్తున్నారని, ఈ సదావకాశాన్ని సినీ పరిశ్రమ పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలని అన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి సినీ నిర్మాతలు కేవలం స్క్రిప్ట్‌తో వస్తే వారి సినిమా నిర్మాణానికి కావాల్సిన షూటింగ్ లొకేషన్లు, వారికి వివిధ శాఖల నుండి కావాల్సిన అనుమతులు, సినీ నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక విభాగాలు, టెక్నీషియన్లు, హైదరాబాద్ తోపాటు రాష్ట్రంలోని వివిధ నగరాల్లో అందుబాటులో ఉన్న హోటళ్లు సహా సంపూర్ణ సమాచారంతో ఈ వెబ్‌సైట్ రూపొందిస్తున్నామన్నారు. ఒక విధంగా చెప్పాలంటే, ఈ విధమైన సౌలభ్యం మొట్టమొదటి సారిగా తెలంగాణాలో మాత్రమే రూపొందిస్తున్నామని దిల్ రాజు అన్నారు. దీనితో పాటు, సినిమా థియేటర్ల నిర్వహణకు కావాల్సిన బీఫామ్ జారీ విధానాన్ని కూడా ఆన్‌లైన్ ద్వారా పొందే సులభతరం విధానాన్ని ప్రవేశపెడుతున్నామని పేర్కొన్నారు. సినిమా థియేటర్ల నిర్వహణకు ఇప్పటివరకు నగరాల్లో సంబంధిత పోలీసు కమిషనర్లు, జిల్లా కేంద్రాలు, పట్టణాల్లో అయితే ఆయా జిల్లా అడిషనల్ కలెక్టర్లు జారీ చేసేవారని, ఇకనుండి ఈ అనుమతులన్నింటినీ ఆన్‌లైన్ విధానం ద్వారా జారీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వ హోమ్ శాఖతో చర్చించి విధి విధానాలు రూపొందించాలని తెలిపారు. ఈ వెబ్‌సైట్ రూపకల్పనకు సంబంధించి తగు సలహాలు, సూచనలు ఇవ్వాల్సిందిగా చిత్ర పరిశ్రమ ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులను ఆయన కోరారు. ఈ వెబ్‌సైట్‌ను పూర్తి స్థాయిలో రూపొందించిన అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిలతో ప్రారంభిస్తామని తెలియచేశారు.



## ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో ఇంత నిర్లక్ష్యమా?

### ప్రభుత్వ తీరుపై మండిపడ్డ ఎంపీ ఈటెల

**హుజూరాబాద్, సెప్టెంబర్ 15 :** తెలంగాణలోని ఇంజినీరింగ్ కళాశాలలకు గత ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించలేదని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వమే ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తోందని తెలిపారు. హుజూరాబాద్ పట్టణంలోని మధువని గార్డెన్‌లో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. తెలంగాణలో రూ.9 వేల కోట్ల రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నట్లు చెప్పారు. విదేశాలకు వెళ్లే విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వ కారణంగా ఎంతో నష్టం జరుగుతోందని ఆరోపించారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో బీసీ విద్యార్థులకు వందశాతం రీయింబర్స్‌మెంట్ ఇస్తామని హామీ ఇచ్చి, పాత విధానంలోనూ రీయింబర్స్‌మెంట్ చేయలేదని విమర్శించారు. ప్రభుత్వాలు మారినప్పుడు పాత బకాయిలు కూడా చెల్లించాల్సిందేనని స్పష్టం చేశారు. తన రాజకీయ జీవితంలో ఇంత బాధ్యత లేని ప్రభుత్వాన్ని చూడలేదని వ్యాఖ్యానించారు. సమస్యలు పరిష్కరించకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదన్నారు. రాష్ట్రానికి కావలసిన యూరియాను ఒక సంవత్సరం ముందు నిల్వ చేసుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదేనని గుర్తు చేశారు. ముందస్తు ప్రణాళిక లేకపోవడం వల్లే రాష్ట్రంలో యూరియా కొరత తలెత్తిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వంపై నెపం నెట్టకుండా, ఎరువులు వచ్చే మార్గంపై దృష్టి పెట్టాలని ఈటల సూచించారు.



## ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో కమిషన్ల కల్లోలం : కవిత

**హైదరాబాద్, సెప్టెంబర్ 15 :** ఆడబిడ్డల చదువులకు కాంగ్రెస్ లిలికమిషన్లలిలి (కమిషన్ల) సర్కారు కలరాస్తోందని (డబ్బులు అప్రమానంగా తగ్గిస్తున్నట్లుగా) ఎమ్మెల్సీ కవిత మండిపడ్డారు. ఉద్దేశపూర్వకంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తెలంగాణ ప్రభుత్వం ఎగవేస్తుందన్నారు. సోమవారం ఆమె ట్వీట్ చేశారు. ప్రభుత్వంలోని కొందరు డిమాండ్లు చేస్తున్నారని ు "20 శాతం లిలికమిషన్లులిలి ఇస్తేనే రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇవ్వాలని" ు అన్నారు. దీని కారణంగా కాలేజీల యాజమాన్యాలు ఆవేదన చెందుతున్నాయని ఆరోపించారు. కమిషన్ల కోసమే బకాయిలు ఏళ్లకేళ్లుగా పెండింగ్లో ఉంటున్నాయని, ఇప్పటికే కాలేజీలు నడపలేక యాజమాన్యాలు ఆర్థికంగా చితికిపోయాయని వివరించారు. కాలేజీలు మూసిపోతే చదువుకు ఆడబిడ్డలు దూరమవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు "ఇందిరమ్మ రాజ్యం తెస్తామని" గప్పాలు ఇచ్చి, ఆడబిడ్డలను చదువులకు దూరం చేస్తున్నారని ధ్వజమెత్తారు.

## కవితతో విష్ణువర్ధన్ రెడ్డి భేటీ

### జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై మంతనాలు



**హైదరాబాద్, సెప్టెంబరు 15 :** మాజీ ఎమ్మెల్యే, దివంగత పీజేఆర్ తనయుడు విష్ణువర్ధన్ రెడ్డి, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితతో భేటీ అయ్యారు. జూబ్లీహిల్స్ సెగ్మెంట్ ఉప ఎన్నిక జరగనున్న నేపథ్యంలో వీళ్లిద్దరి భేటీ- ప్రాధాన్యం సంతరించుకుంది. పీజేఆర్ వారసుడిగా రాజకీయ అరంగేట్రం చేసిన విష్ణువర్ధన్ రెడ్డి ఖైరతాబాద్ నుంచి 2008లో నిర్వహించిన ఉప ఎన్నికలో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. తర్వాత 2009లో జూబ్లీహిల్స్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగి విజయం సాధించారు. 2018లో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగిన విష్ణు ఓటమి చెందారు. అప్పుడు దివంగత గోపీనాథ్ బీఆర్ఎస్ తరఫున విజయం సాధించారు. 2023 అసెంబ్లీ ఎన్నికలలో మరోసారి టికెట్ ఆశించినప్పటికీ కాంగ్రెస్ పార్టీ నిరాకరించడంతో ఎన్నికల సమయంలోనే కాంగ్రెస్‌కు రాజీనామా చేసి కేసీఆర్‌ను కలిసి బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ లో చేరినప్పటికీ రాజకీయంగా మాత్రం అంత చురుకుగా ఉండటం లేదు. మాగంటి మరణంతో జూబ్లీహిల్స్‌లో ఉప ఎన్నికలు రావడంతో బీఆర్ఎస్‌లో కొనసాగుతున్న విష్ణును కవిత కలుసుకోవడం ఆసక్తిగా మారింది. వీళ్లిద్దరి మధ్య ఉప ఎన్నికపైనే ప్రధానంగా చర్చ జరిగినట్టు సమాచారం. మీటింగ్ తర్వాత బయటికి వచ్చిన విష్ణు మీడియాతో మాట్లాడారు. తాను కేటీఆర్ వెంటే ఉంటానని, పెద్దమ్మ ఉత్సవాలకు ఆహ్వానించేందుకు మాత్రమే కవిత ఇంటికి వెళ్లినట్టు చెబుతున్నారు. అనంతరం జరిగిన వెంగళరావ్ నగర్ డివిజన్ సమావేశంలోనూ విష్ణు పాల్గొన్నారు.

## మంచిర్యాలలో వందేభారత్‌కు హాల్ట్

**మంచిర్యాల, సెప్టెంబర్ 15 :** వందేభారత్ రైలు స్టాపేజీతో మంచిర్యాల జిల్లా ప్రజల చిరకాల కోరిక నెరవేరిందని ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో వందేభారత్ స్టాపేజీని కేంద్ర మంత్రి బండి సంజయ్, తెలంగాణ మంత్రి వివేక్, ఎంపీ వంశీకృష్ణ జెండా ఊపి ప్రారంభించారు. పార్లమెంట్‌లో తనకు అవకాశం వచ్చినప్పుడు మొదటి విషయం మంచిర్యాలలో వందేభారత్ ఆపాలని ప్రస్తావించినట్లు- ఎంపీ వంశీకృష్ణ తెలిపారు. రైల్వే అనుసంధానం ద్వారా ప్రతి ప్రాంతం అభివృద్ధి చెందుతుందని మంత్రి వివేక్ వెల్లడించారు. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీలో నిర్వహణ లోపాలతో ఇక్కడి రైతులకు యూరియా ఇబ్బందులు తప్పట్లేవని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణకు అన్ని రకాల నిధులు అందించేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని కేంద్రమంత్రి బండి సంజయ్ తెలిపారు.

# పాలకులు అధికార దాహం వీడాలి!




**దేశంలో దాదాపు ఏడేను మిదేనిమిదేళ్ల పాటు జీఎస్టీతో వత్తులు పెట్టిన మోడీ ప్రభుత్వం ఇప్పుడు అందులో కొంత తగ్గించి "నెక్స్ట్ జనరేషన్ సంస్కరణలు" అంటోంది. ఆషాఢం సేల్‌లాగా తగ్గించి అమ్ముకోవడం అన్నది గుర్తుకు వస్తోంది. నిజానికి జీఎస్టీ ప్రకటించినప్పుడు ఇది అతిపెద్ద సంస్కరణగా అభివర్ణించారు. ఇప్పుడేమో రాబోయే తరం కోసం సంస్కరణ అంటున్నారు. ఇంతకాలం నెత్తీనోరు మోత్కొన్నా జీఎస్టీ తగ్గించలేదు. ఇన్సూరెన్స్‌లపైనా జీఎస్టీ విధించారు. దాదాపు 11 ఏళ్ల తరవాత కూడా ఇంకా కాంగ్రెస్‌ను విమర్శిస్తూ... వారు అలా చేశారని, ఇలా చేశారని పాలన సాగించడం సిగ్గు చేటు.**

జీఎస్టీ తగ్గింపులే కాదు... నిరుద్యోగ సమస్యకు కూడా పరిష్కారం చూపాలి. అలాగే ఉపాధి, ఉద్యోగాల కల్పనపై దృష్టి సారించాలి. యూరియా కొరతతో రైతులు నానా అగచాట్లకు గురవుతున్నా, వారు తిరుగుబాటు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. ఇదొక హెచ్చరికగా చూడాలి. రైతాంగం పట్ల నిర్లక్ష్యాన్ని పరాకాష్టగా చూడాలి. ధరలను అదుపు చేయడం, నిరుద్యోగాన్ని తగ్గించడం, పండిన ధాన్యం లేదా వ్యవసాయ ఉత్పత్తులను కొనేలా మార్కెట్ సౌకర్యం కల్పించడం చేయాలి. బంగారం ధరలు పెరుగుతున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. అంతర్జాతీయ కారణాలు చూపి తప్పించుకోకుండా, ఎందుకిలా పెరుగుతున్నాయో విశ్లేషించాలి. అలాగే రాజకీయ పెత్తనం తగ్గాలి. రాజకీయంగా ఎంపీలు, ఎమ్మెల్యేలే జీతభత్యాలు తగ్గాలి. ఒక్కో ఎమ్మెల్యేకు కనీసం 4-5 లక్షల మధ్య నెలవారీ చెల్లింపులు అధికంగా భావించాలి. డబుల్ పెన్షన్‌లు వెంటనే ఆగాలి. కేంద్రంతో పాటు రాష్ట్రాలు కూడా ఖర్చులు తగ్గించుకోవాలి.

ఆస్తులు అమ్ముకోవడం ద్వారా ఆస్తులు సమకూర్చాలన్న భావన సరికాదు. పొరుగుదేశాల్లో ఆందోళనలు కనువిప్పుగా మారాలి. శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్‌లో ప్రజల తిరుగుబాటుకు కారణాలు తెలుసుకుని, మనవద్ద అలాంటివి జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. చిన్న దేశాల్లో అస్థిరతకు విదేశీ హస్తం కూడా కారణం ఉండవచ్చు. అయితే ప్రజల్లో అసంతృప్తి, అసహనం గూడుకట్టుకొని ఉండటం వల్లే తిరుగుబాట్లు వస్తున్నాయి. ఇలాంటి సందర్భాల్లో విదేశీ శక్తులు కూడా తోడవుతుండవచ్చు. ఎందుకంటే ధరలు, అణచివేత, నిరుద్యోగం, రైతుల సమస్యలు ఇవన్నీ ప్రజల్లో ఆందోళనకు కారణమవుతాయి. ఇందిరాగాంధీ అధికారంలో ఉన్నప్పుడు తన ప్రభుత్వానికి ఇబ్బంది ఏర్పడినప్పుడల్లా "విదేశీ హస్తం" అని నిందించేవారు. ఇప్పుడు మోడీ కూడా పదే పదే కాంగ్రెస్‌ను బూచిగా చూపి తప్పించుకో ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వాలు, వ్యవస్థల్లో అవినీతి పెరిగిపోవడం వల్లే మన దేశం అభివృద్ధి చెందాల్సినంతగా అభివృద్ధి చెందలేదు. రాజకీయ లాలూచీ, అవినీతి కారణంగా దేశం భ్రష్టుపట్టిపోతోంది. రాజ్యాంగబద్ధ సంస్థలలో కూడా అవినీతి చొరబడటంతో సామాన్యులకు న్యాయం దొరకని దుస్థితి ఏర్పడుతోంది. వివేకానంద రెడ్డి హత్య జరిగిన ఆరు ఏళ్లయినా తేల్చలేకపోయారు. సీబీఐ, ఈడీ కేసులు కూడా ఏవీ తేలడం లేదు. కాళేశ్వరం, ఈ-కార్ రేసుల్లో అవినీతిని నిగ్గు తేల్చడం లేదు. కేసులే అపరిష్కృతంగా ఉండగా న్యాయవ్యవస్థపై, ప్రభుత్వాలపై ప్రజలకు నమ్మకం ఎలా ఉంటుందో పాలకులు ఆలోచించాలి.

నేపాల్‌లో కేవలం ఒక్క కారణంతోనే తిరుగుబాటు రాలేదు. ప్రభుత్వంపై ప్రజల్లో అప్పటికే అసంతృప్తి గూడుకట్టుకొని ఉంది. అనేక అంశాలు ఇందుకు తోడయ్యాయి. శ్రీలంకలో కూడా ఆ దేశ అధ్యక్షుడి భవనంపై ప్రజలు దాడి చేసి, ఆయన బెడ్‌రూంలో, స్నానాల తొట్టిలో కూర్చొని ఫొటోలకి పోజులిచ్చారంటే ప్రభుత్వంపై ఎంత విరక్తి చెందారో అర్థం చేసుకోవచ్చు. ఆ తిరుగుబాట్ల తర్వాత శ్రీలంక, బంగ్లాదేశ్‌లో ప్రభుత్వాలు మారినా ప్రజల జీవితాలు మాత్రం మారలేదు. గతంలో విప్లవాలన్నీ పాలకుల అవినీతి, అక్రమాలు, నిరంకుశతపై వచ్చినవే. మనదేశంలో రోజువారీ కేసులన్నీ రాజకీయాలకు సంబంధించినవిగానే ఉంటున్నాయి. వాటి చుట్టే కోర్టు తీర్పులు తిరుగుతున్నాయి. అనేక కేసుల్లో న్యాయం దక్కడం లేదన్న ఆందోళన ప్రజల్లో ఉంది. ఇవన్నీ మననం చేయాలి, పరిశీలించాలి. అందువల్ల న్యాయవ్యవస్థపై ఇక్కడి ప్రజలు విశ్వాసం కోల్పోకుండా భరోసా నింపాలి. కొంతకాలంగా శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్ దేశాలలో చోటుచేసుకున్న ప్రజల ధర్మాగ్రహం నుంచి మన పాలకులు, రాజ్యాంగ సంస్థల అధిపతులు నేర్చుకోవాల్సిన పాఠాలు అనేకం ఉన్నాయి.

మన దేశం భిన్న జాతులు, భిన్న మతాలు, భిన్న సంస్కృతులు, భిన్న భాషల సమాహారం కనుక ఆ చిన్న దేశాల వలే తిరుగుబాట్లు జరగవని నమ్మకూడదు. రైతుల ఉద్యమాన్ని తక్కువగా చూడరాదు. ఇందిరాగాంధీ వంటి శక్తిమంతమైన నేత కూడా ప్రజాగ్రహానికి గురికాక తప్పలేదు. ఎందుకంటే కేంద్ర, రాష్ట్రాల్లో విపరీతమైన అవినీతి పెరిగింది. లంచగొండితనమే వేళ్లూనుకుంది. ఏ పనికైనా లంచం లేకుండా ఫైలు కదలడం లేదు. రాజకీయ నాయకులు విలాసాలకు అలవాటు పడ్డారు. అందుకే ప్రజలు పాలకులపై విశ్వాసం కోల్పోతున్నారు. ఆయా వ్యవస్థలపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోంది. అధికారాన్ని లక్ష్యంగా పెట్టుకుని సంక్షేమం పేరిట హద్దులు మించి ప్రజా ధనాన్ని పంచిపెట్టడంపై పన్ను చెల్లింపుదారులు ఆగ్రహంగా ఉన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించకుండా ప్రజలను సోమరులుగా మార్చే పథకాలను ప్రవేశపెట్టే అధికారం రాజకీయ నాయకులకు లేదు. ప్రజాధనానికి కాపలా ఉండి కేర్‌టేకర్‌లా పనిచేయాల్సిన వారు విచ్చలవిడిగా ఖర్చు పెడుతున్నారు. సామాన్యులకు న్యాయం ఎండమావిగా మారుతోంది. అధికార దుర్వినియోగం హద్దులు దాటుతోంది. ఈ పరిస్థితిని చక్కదిద్దాల్సిన బాధ్యత పాలకులు, రాజ్యాంగ సంస్థల అధిపతులపై ఉంది. న్యాయాధికారులు, న్యాయమూర్తులు ఈ వాస్తవాన్ని గుర్తించి బాధితులకు సత్వర న్యాయం అందిస్తే ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది. అలాగే రాజకీయ నాయకులు తమ అధికాహంకారాన్ని వదులుకొని ప్రజల కోసం, దేశం కోసం పనిచేయడం అలవాటు చేసుకోవాలి. లేకపోతే ప్రజాగ్రహం తప్పదు.

# భూముల అమ్మకంపై దృష్టి

- రోజురోజుకు పెరుగుతున్న ఖర్చులతో పరేషాన్
- ఆదాయం సమకూర్చే రంగాలపై ప్రభుత్వం ప్రత్యేక ఫోకస్





**హైదరాబాద్, సెప్టెంబర్ 15 :** రాయదుర్గంలో భూమి అమ్మకానికి ప్రభుత్వం సిద్ధమైంది. ఎక్కడెక్కడ ఆస్తులు ఉన్నాయో గుర్తించి అమ్ముకోవడం పరిపాటిగా మారింది. గతంలో కేసీఆర్ ఇదే విధంగా చేశారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా అదే చేస్తున్నారు. సంక్షేమం పేరిట దుబారాను ఆపితే కొంతయినా భారం తగ్గుతుంది. కానీ అలా చేయకుండా ఉన్న భూములను తెగనమ్ముతున్నారు. కంచన్‌బాగ్-గచ్చిబౌలి భూముల విషయంలో సుప్రీం కోర్టు జోక్యం చేసుకోవడంతో అవి ఆగిపోయాయి. లేకపోతే ఈపాటికే అవి ఫలహారంగా మారేవి. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని చెబుతున్న సీఎం రేవంత్ రెడ్డి, అమ్మకాలపైనే దృష్టి సారించారు. ఖర్చులు విపరీతంగా పెరగడం చూస్తున్నాం. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో కాలేజీలు మూతపడ్డాయి. ఆరోగ్యశ్రీ చెల్లింపులపై విమర్శలు వస్తున్నాయి. అయితే భారంగా మారిన పథకాలపై సమీక్షలు చేయడం లేదు. కేవలం ఆదాయాలను ఎలా పెంచుకోవాలన్న దానిపైనే దృష్టి సారించారు.

## హామీలు అమలు చేయాలంటే నిధులు అవసరం

కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలంటే నిధులు అవసరం. దీంతో ఆదాయ వనరులను పెంచుకుని రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు చర్యలు ప్రారంభించింది. అందులో భాగంగా ప్రధానంగా కమర్షియల్ ట్యాక్స్, ఎక్సైజ్, గనులు, రిజిస్ట్రేషన్ల శాఖలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. ఆదాయ వనరుల సమీక్ష, లక్ష్యాలపై ఇటీవల క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశమైంది. లక్ష్య సాధనకు అన్ని శాఖలు పక్కా ప్రణాళికలతో ముందుకు సాగాలని సబ్ కమిటీ అధికారులకు సూచించింది. ఔటర్ రింగ్‌రోడ్‌లోపల ఉన్న కాలుష్యకారక పరిశ్రమల తరలింపునకు ప్రభుత్వం విధివిధానాలు రూపొందించే పనిలో నిమగ్నమైంది. కేసీఆర్ హయాంలో అజాంపురా, నాచారం, ఉప్పల్ పారిశ్రామిక వాడలను తరలించి, అక్కడ ఉన్న భూములను టెండర్ ద్వారా విక్రయించాలని చూశారు. హైదరాబాద్ నగరానికి సరిహద్దులో ఉన్న జిల్లాల్లో నూతనంగా పారిశ్రామిక వాడల ఏర్పాటుకు ప్రభుత్వం యోచిస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లా హైదరాబాద్‌కు సరిహద్దులో ఉండటంతో పలు ప్రాంతాల్లో పరిశ్రమలు నెలకొల్పే అవకాశం ఉంది. జిల్లా పరిధిలో హైదరాబాద్-విజయవాడ (65), హైదరాబాద్-భూపాలపల్లి (163) జాతీయ రహదారులు ఉండటంతో పాటు, సరిహద్దులోనే రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు కూడా అందుబాటులో ఉంది. ఈ నేపథ్యంలో రీజనల్ రింగ్‌రోడ్డు వెంట ఇండస్ట్రియల్ జోన్‌లను ఏర్పాటు చేయనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. మరోవైపు ఇప్పటికే జిల్లాలో భువనగిరి, చౌటుప్పల్, బీబీనగర్, భూదాన్‌పోచంపల్లి మండలాల్లో పలు పరిశ్రమలు ఉన్నాయి. జిల్లాలో టీఎస్-ఐపాస్ కింద మొత్తం 1,090 పరిశ్రమలు ఉండగా, వీటి ద్వారా 41,270 మందికి ఉపాధి లభిస్తోంది. టీ-ఐడియా, టీ-ప్రైడ్ పథకాల కింద 796 యూనిట్లు మంజూరయ్యాయి. చౌటుప్పల్ మండలం దండుమల్కాపురంలో ఆసియా ఖండంలోనే అతిపెద్ద ఎంఎ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని రాష్ట్ర ఆదాయాన్ని మెరుగుపరిచేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. అందులో భాగంగా అన్ని శాఖలు విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. హైదరాబాద్ నగరానికి చేరువలో ఉన్న ప్రాంతాల్లో ఆదాయం పెంపుపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించే పనిలో ఉంది. ఆయా ప్రాంతాలు నగరానికి చేరువలో ఉండటంతో రియల్ ఎస్టేట్‌తో పాటు ఎక్సైజ్, వాణిజ్య పన్నుల శాఖల ద్వారా సర్కారు కు ఆదాయం సమకూరుతోంది. ప్రస్తుతం ఉన్న ఆదాయాన్ని మరింతగా పెంచేందుకు హైదరాబాద్ సరిహద్దులో ఉన్న జిల్లాల్లో పారిశ్రామికాభివృద్ధితో పాటు టూరిజాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. జిల్లా కేంద్రాల్లో విలువైన భూములను కాపాడేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. మైనింగ్ శాఖ పరిధిలో ఖనిజ సంపదను వెలికితీయడం ద్వారా ఆదాయం సమకూరుతోంది. ఈ శాఖల ద్వారా ప్రభుత్వం మరింత ఆదాయం పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఉన్నతాధికారులు అధ్యయనం చేస్తున్నారు.

# అమెరికాను సురక్షితం చేయడమే లక్ష్యం

### నాగమల్లయ్య హత్యపై తీవ్రంగా స్పందించిన ట్రంప్



**వాషింగ్టన్, సెప్టెంబర్ 15 :** అమెరికాను మళ్లీ సురక్షితం చేయడమే తమ లక్ష్యమని అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించబోమని అన్నారు. అక్రమ వలసలను ఇక ఎంతమాత్రం ఉపేక్షించబోమని అన్నారు. డాలస్ లో భారతీయుడు చంద్ర నాగమల్లయ్యను క్యూబా వలసదారుడు హత్య చేయడంపై ఆయన తీవ్రంగా స్పందించారు. నిందితుడిపై ఫస్ట్ డిగ్రీ కింద అభియోగాలు నమోదు చేసి విచారణ చేపడతామని హామీ ఇచ్చారు. 'ఇకపై అక్రమ వలసదారులపై మెతకవైఖరి అవలంబించబోమని స్పష్టం చేశారు. 'చంద్ర నాగమల్లయ్య హత్య కేసులో సంచలన విషయాలు నా దృష్టికి వచ్చాయి. డాలస్‌లో మల్లయ్యకు మంచి పేరుంది. అలాంటి వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. తన భార్య, కుమారుడు చూస్తుండగానే ఈ ఘోరం జరిగింది. మా దేశానికి సంబంధం లేని, క్యూబాకు చెందిన అక్రమ వలసదారుడు ఈ దురాగతానికి పాల్పడ్డాడు' అని ట్రంప్ ట్రూత్ సోషల్ వేదికలో పోస్టు పెట్టారు. గతంలో బైడెన్ ప్రభుత్వం అనుసరించిన విధానమే నిందితుడు మార్టినెజ్ అమెరికాలో నివసించేందుకు దోహదపడిందని ట్రంప్ విమర్శించారు. అతడికి నేరచరిత్ర ఉన్నా.. నివాసానికి అనుమతించారని ధ్వజమెత్తారు. 'ఈ వ్యక్తి క్రూరమైన నేరాలకు పాల్పడి గతంలోనే అరెస్టయ్యాడు. చిన్నారిపై లైంగిక దాడి, దొంగతనం తదితర కేసులు అతడిపై నమోదయ్యాయి. అలాంటి వ్యక్తిని బైడెన్ మా గడ్డ మీదకు తీసుకొచ్చారు. ఎందుకంటే క్యూబా ఇలాంటి దుష్టులను తమ దేశంలో ఉంచుకోవాలను కోలేదు. అక్రమ వలసదారులపై ఇక సున్నితంగా వ్యవహరించబోను' అంటూ ట్రంప్ పేర్కొన్నారు. సెప్టెంబర్ 10న ఓ మోటెల్‌లో నాగమల్లయ్య హత్యకు గురయ్యారు. క్యూబాకు చెందిన యోర్డానిస్ కోబోస్ మార్టినెజ్ ఈ దారుణానికి పాల్పడ్డాడు. వెంటనే పోలీసులు అతడిని అరెస్టు చేశారు. నాగమల్లయ్య తల నరికి మరీ దానికి చెత్తబుట్టలో వేయడంతో ఈ కేసు సంచలనంగా మారింది.

# మేధా పాఠశాల మూసివేత

### సమాచారం తెలియక తల్లిదండ్రుల ఆందోళన

**హైదరాబాద్, సెప్టెంబరు 15 :** అల్ప్రాజోలం తయారీ కేసులో సికింద్రాబాద్ బోయిన్‌పల్లిలోని మేధా పాఠశాలను అధికారులు ఆదివారం సీజ్ చేశారు. ఈ సమాచారం తెలియక సోమవారం విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి పాఠశాలకు వచ్చారు. పాఠశాల సీజ్ అయినట్లు- కనీసం సమాచారం కూడా ఇవ్వలేదని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. టీసీ ఇస్తే ఇతర పాఠశాలలో చేర్పించుకుంటామని తెలిపారు. పాఠశాలలో మత్తు పదార్థాలు తయారు చేయడం దారుణమన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని విద్యాశాఖ అధికారులు ప్రత్యామ్నాయ మార్గం చూపించాలని కోరారు. ఇప్పటికే పాఠశాలకు 70 శాతం ఫీజులు చెల్లించినట్లు- వెల్లడించారు. ప్రస్తుతం విద్యార్థుల భవితవ్యం అగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మలేల జయప్రకాశ్‌గౌడ్(39) హైదరాబాద్ ఓల్డ్ బోయిన్‌పల్లి సాయికాలనీలో నివాసం ఉంటున్నాడు. అదే ప్రాంతంలో మేధా పేరుతో పాఠశాల నిర్వహిస్తున్నాడు. డబ్బు సంపాదించాలనే ఆశతో అల్ప్రాజోలం తయారీ దందాకు తెరలేపాడు. తయారీ ఫార్ములాను గురువారెడ్డి అనే వ్యక్తి ఇచ్చాడు. స్కూలు రెండో అంతస్తులోని రెండు గదుల్లో పరికరాల సాయంతో తయారుచేసి, మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూరు మండలంలోని వివిధ ప్రాంతాల్లోని కల్లు దుకాణాలకు సరఫరా చేస్తున్నాడు. ఈ సమాచారం అందుకున్న ఈగల్ బృందం శనివారం ఆకస్మిక తనిఖీలు చేసింది. జయప్రకాశ్‌గౌడ్, అతడికి సహకరిస్తున్న బోయిన్‌పల్లికి చెందిన పెంటమోల్ ఉదయ్ సాయి(23), గౌటె- మురళి(23)లను అదుపులోకి తీసుకుంది. ఆదివారం అధికారులు పాఠశాలను సీజ్ చేశారు.

# మావోయిస్టు సీనియర్ కమాండర్ సహదేవ్ ఎన్‌కౌంటర్



**ఝార్ఖండ్ :** మావోయిస్టులకు మరో భారీ ఎదుదెబ్బ తగిలింది. ఆ సంస్థకు చెందిన ముగ్గురు మావోయిస్టులను ఝార్ఖండ్‌లో హజారీబాగ్ జిల్లాలో భద్రతా దళాలు ఎన్‌కౌంటర్ చేశాయి. వీరిలో సీనియర్ కమాండర్ సహదేవ్ సోరెన్ కూడా ఉన్నారు. 209 బెటాలియన్ కోబ్రా దళాలు గోర్హర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పంతిత్రి అడవుల్లో జాయింట్ ఆపరేషన్ చేపట్టగా ఈ ఘటన చోటుచేసుకొంది. సహదేవ్ సోరెన్‌ను మావోయిస్టు కేంద్రకమిటీ సభ్యుడిగా భావిస్తున్నారు. ఆయనపై రూ.1 కోటి రివార్డు ఉంది. ఇక మరో మావోయిస్టు రఘునాథ్ హేమంబరం స్పెషల్ ఏరియా కమిటీ సభ్యుడు. అతడిపై రూ.25 లక్షల బహుమతి ఉంది. ఇక జోనల్ కమిటీ సభ్యుడు విర్సెన్ గంజూ కూడా వీరిలో ఉన్నాడు. అతడిపై ప్రభుత్వం రూ.10లక్షల బహుమతిని ప్రకటించింది. ఈ ఎన్‌కౌంటర్ సందర్భంగా తాము మూడు ఏకే-47 రైఫిళ్లను స్వాధీనం చేసుకొన్నట్లు వెల్లడించారు. భద్రతా దళాలు ఆ ప్రదేశంలో కూంబింగ్‌ను కొనసాగిస్తున్నాయి. జులైలో ఓ కోబ్రా జవాన్ హత్యలో సహదేవ్ పేరు వచ్చింది. నాడు బొకారో పోలీసులు చేపట్టిన సెర్చి ఆపరేషన్ సందర్భంగా తగిలిన తూటా గాయానికి అతడు మరణించాడు. తాజాగా ఈ ముగ్గురు మావో నేతలు ఏదో పెద్ద ఆపరేషన్‌కు ప్లాన్ చేస్తున్నట్లు ఎస్పీ హర్వీందర్ సింగ్ వెల్లడించారు. సెప్టెంబర్ 7వ తేదీన జరిగిన ఓ ఆపరేషన్‌లో మావోయిస్టుల సీనియర్ నాయకుడు అమిత్ హన్స్‌డా మరణించాడు. జోనల్ కమాండర్ అయిన అతడిపై రూ.10 లక్షల రివార్డు ఉంది. మొత్తం 95 కేసుల్లో అతడు నిందితుడు. వీటిల్లో చాలామంది పోలీసులు, పౌరుల హత్యలు ఉన్నాయి. మరోవైపు ఛత్తీస్‌గఢ్‌లో కూడా మావోయిస్టుల ఏరివేత శరవేగంగా జరుగుతోంది. కొన్ని రోజుల క్రితం జరిగిన ఎన్‌కౌంటర్‌లో అగ్రనేతలు మోడెం బాలకృష్ణ, అల్వాల్ చంద్రహాస్ సహా 10 మందిని ఎన్‌కౌంటర్ చేశారు.



## ఏఐ కంటెంట్ క్రియేటర్లకు లైసెన్స్‌లు అవసరం

### పార్లమెంట్ సంఘం

**న్యూఢిల్లీ :** కృత్రిమేధ సాయంతో కంటెంట్ క్రియేట్ చేసేవారు కచ్చితంగా లైసెన్స్‌లు తీసుకోవాలని పార్లమెంటరీ ప్యానల్ సూచించింది. దీంతో ఏఐ ఆధారిత వీడియోలు, కంటెంట్‌కు అనుమతులు తప్పనిసరిగా మారే అవకాశం ఉంది. తీవ్రస్థాయిలో వ్యాపిస్తున్న తప్పుడు వార్తలను అడ్డుకోవడానికి ఈ ప్రతిపాదనను ముందుకుతీసుకొచ్చినట్లు తెలుస్తోంది. కమ్యూనికేషన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఈ నివేదికను ఇచ్చింది. దీనికి భాజపా ఎంపీ నిషికాంత్ దుబే అధ్యక్షత వహిస్తున్నారు. ఇలాంటి తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసే సంస్థలు, వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకొనే మార్గాలను కోరింది. ఈ కమిటీ ఇటీవలే తమ ముసాయిదా నివేదికను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు సమర్పించింది. వచ్చే సీజన్ సమావేశాల్లో దీనిని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. సమాచార, ఎలక్ట్రానిక్-ఐటీ మంత్రిత్వ శాఖలు సహా.. ఇతర మంత్రులు, విభాగాల మధ్య బలమైన సమన్వయం అవసరమని పేర్కొన్నారు. ఇప్పటికే డీఫ్‌ఫేక్ టెక్నాలజీ నుంచి వచ్చే సమస్యలను అధ్యయనం చేయడానికి ఎలక్ట్రానిక్-ఐటీ మంత్రిత్వశాఖ తొమ్మిది మంది సభ్యులతో కూడిన సంఘాన్ని ఏర్పాటుచేసింది. డీఫ్‌ఫేక్ స్పీచ్, వీడియోలు, వాయిస్ గుర్తించేందుకు వీలుగా రెండు ప్రాజెక్టులు మొదలైనట్లు ఈ నివేదిక వెల్లడించింది. ప్రజలు, ప్రజాస్వామ్యానికి ఫేక్ న్యూస్ తీవ్రమైన ముప్పుగా మారాయని కమిటీ అభిప్రాయపడింది.

## శ్రీవారి సేవలో మహిళా ప్రముఖులు

### స్వామిని దర్శించుకున్న డికె అరుణ తదితరులు

**తిరుమల, సెప్టెంబర్ 15 :** తిరుమల శ్రీవారిని పలువురు రాజకీయ ప్రముఖులు దర్శించుకున్నారు. సోమవారం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో ఎమ్మెల్యేలు మాధవి రెడ్డి, భూమా అఖిలప్రియ, ఎంపీ డీకే అరుణ, ఎంపీ రవిచంద్ర, గుజరాత్ ఎమ్మెల్యే రివాబా జడేజా.. స్వామివారి సేవలో పాల్గొన్నారు. తితిదే అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వారు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను వారికి అందజేశారు. శ్రీవారిని దర్శించున్న వారిలో టీమ్‌ఇండియా క్రికెటర్ రవీంద్ర జడేజా సతీమణి, గుజరాత్ ఎమ్మెల్యే రివాబా జడేజా ఉన్నారు. సోమవారం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో స్వామివారి సేవలో ఆమె పాల్గొన్నారు. తితిదే అధికారులు ఆమెకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు- చేశారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను ఆమెకు అందజేశారు. వీరంతా తిరుపతిలో జరుగుతున్న మహిళా సాధికార సదస్సులో పాల్గొనేందుకు వచ్చారు.



## హాఫీజ్ పేట్ ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన
# బోయిని మహేష్ యాదవ్

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్:** సోమవారం హఫీజ్ పేట్ ప్రభుత్వ పాఠశాలని సందర్శించడం జరిగింది. ఎప్పటినుంచో వివాదాస్పదంగా ఉన్నటువంటి పాఠశాల ప్రహరీ గోడ గురించి చర్చించడం జరిగింది. స్కూలుకు సంబంధించిన పలు సమస్యల గురించి గతంలో ఫిర్యాదు చేయడం జరిగింది. కానీ సమస్యలు తీరలేదు. కాబట్టి దీనికి సంబంధించిన వ్యక్తులతో చర్చలు జరపడం జరిగింది. వారు దీనికి సానుకూలంగా స్పందించినారు అతి త్వరలో పాఠశాల యొక్క ఇబ్బందులు తొలిగిపోయి ఈ స్కూల్ ని కూడా మదినగూడ ప్రభుత్వ పాఠశాల లాగా స్థానికంగా ఉన్నటువంటి సాఫ్ట్వేర్ కంపెనీల స్థానిక ప్రజా ప్రతినిధుల సహాయ సహకారాలతో అద్భుతంగా తీర్చిదిద్దాలని చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపి రాష్ట్ర ఓబిసి మోర్చా కార్యవర్గ సభ్యులు బోయిని మహేష్ యాదవ్, యువ నాయకులు ధాత్రి గౌడ్, పాఠశాల ఇంచార్జ్ ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.



## 'యాత్ర దానం 'పోస్టర్ ను ఆవిష్కరించిన
# పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్:** టిజిఎస్ ఆర్టీసి సామాజిక బాధ్యతలో భాగంగా వినూత్న సేవ కార్యక్రమం 'యాత్ర దానం' పోస్టర్ను మియాపూర్–1 డిపో మేనేజర్ వంగల మోహన్ రావు, అసిస్టెంట్ మేనేజర్ అశ్విని దేవి తో కలిసి పోస్టర్ ను ఆవిష్కరించిన పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ... వ్యక్తుల పుట్టినరోజు, వివాహ వార్షికోత్సవాలు, పండుగలు, ఇతర శుభదినాలు వంటి ఆనందకర సందర్భాలలో అనాథలు, నిరాశ్రయులు, వృద్ధులు, దివ్యాంగులు, నిరుపేద విద్యార్థులను ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలు, విహార యాత్రలకు తీసుకెళ్లడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం అని గాంధీ తెలియచేసారు. ఈ మహోన్నత సేవ లో భాగస్వాములవదలచినవారు వారి యొక్క సంతోషకరమైన రోజులో ఈ కార్యక్రమం ద్వారా ఇతరుల చిరునవ్వుల్లో ఆనందాన్ని పొందవచ్చు తాము కోరుకునే శుభదినాన టిఎస్ఆర్టిసి కి విరాళం అందజేసి ఆ విరాళం ఆధారంగా ఏసీ, సూపర్ లగ్జరీ బస్సు ద్వారా విహారయాత్రలు ఏర్పాటు చేయించుకోవచ్చని తెలిపారు. తాము జరుపుకునే శుభదినాన తగిన మొత్తాన్ని సంస్థకు విరాళంగా అందజేయడం ద్వారా ఆర్టీసీ బస్సు సదుపాయం కల్పిస్తుందని యాత్రదానం కార్యక్రమం నిర్వహణ కోసం ప్రత్యేక నిధి సంస్థ ఏర్పాటు చేసిందన్నారు. వ్యక్తులతోపాటు ప్రజాప్రతినిధులు కార్పొరేట్ సంస్థలు ఎన్ఆర్ఐ, అసోసియేషన్లు ఎన్జీవోలు స్పాన్సర్ చేసి అనాథలు, నిరాశ్రయులు వృద్ధులు, దివ్యాంగులు, విద్యార్థులు, ప్రసిద్ధ దేవాలయాలకు, పర్యాటక ప్రాంతాలకు, విహార యాత్రలకు తీసుకెళ్ళచ్చని తెలిపారు. ఈ యాత్ర దినాలను వ్యక్తులు కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, కూడా వినియోగించుకోవచ్చని యాత్రదాన కార్యక్రమం సమర్థవంతంగా అమలు చేసేందుకు రాష్ట్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు, పర్యాటక సంస్థలను కవర్ చేస్తూ ప్రత్యేక టూర్ ప్యాకేజీలను సంస్థ రూపొందించారు. దాతలు చెల్లించే విరాళం మేరకు కిలోమీటర్ల ఆధారంగా ఏసి, సూపర్ లగ్జరీ, బస్సులను విహారయాత్రలకు సంస్థ ఏర్పాటు చేస్తుందని, టూర్ ప్రారంభానికి వారం రోజుల ముందు బస్సులను బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. డిపో మనగర్లను (మియాపూర్–1, మియాపూర్–2) అధికారులను సంప్రదించి యాత్రదానం కింద బస్సులను బుక్ చేసుకోవచ్చని అదేవిధంగా హెల్ప్లైన్ నంబర్లు 9959226153, 7659029882 టోల్ ఫ్రీ నెంబర్ : 040-69440000, 040-23450033 లకు కాల్ చేసి సమాచారం ఇచ్చినట్లైతే, సంబంధిత అధికా రులు తిరిగి సంప్రదించి పూర్తి వివరాలను తెలియజేస్తారని పీఏసీ చైర్మన్ గాంధీ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా అనాథలు, నిరాశ్రయులు, దివ్యాంగులు, నిరుపేద విద్యార్థులకు జీవితంలో మరపురాని అనుభూతిని కలిగించవచ్చని పీఏసీ చైర్మన్ గాంధీ తెలిపారు.




## ప్రజావాణిలో ప్రజా సమస్యలపై వినతి పత్రం అందజేసిన
# మారబోయిన రవి యాదవ్

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్:** శేరిలింగంపల్లి నియోజకవర్గం 106వ డివిజన్లోని సోమవారం పాపిరెడ్డి కాలనీ అండర్పాస్ రైల్వే బ్రిడ్జ్, గోపీనగర్ నెహ్రూ నగర్ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై గ్రేటర్ హైదరాబాద్ బీఆర్ఎస్ యూత్ మాజీ వైస్ ప్రెసిడెంట్ మారబోయిన రవి యాదవ్ ప్రజావాణి కార్యక్రమంలో ఐఏఎస్ అధికారి హేమంత్ భోర్కడే కి డిప్యూటీ కమిషనర్ వి. ప్రశాంతి కి వినతి పత్రం అందజేశారు. అండర్పాస్ బ్రిడ్జి ప్రధాన రహదారి ఈ రోడ్డుపై రోజుకు 40 నుండి 50 వేయిల మందికి పైగా ప్రయాణిస్తుంటారు మధ్యతరగతి ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. లింగంపల్లి బ్రిడ్జ్ సర్కిల్ వద్ద ట్రాఫిక్ జామ్ అవుతుంది, వర్షాకాలంలో నీటి నిల్వలు మరింత తీవ్రమవుతాయి. పాఠశాలకు వెళ్లే పిల్లలు ఆఫీసు కు వెళ్లే ఉద్యోగులకు అసావకార్యం కలుగుతుంది. గోపి నగర్ నెహ్రూ నగర్ ప్రజా సమస్య తాగునీటి సరఫరా సమయం సరిపోవడం లేదు, స్పీడ్ తగ్గుతుంది. పైపులు పూర్తిగా దెబ్బతిన్నాయి, నీరు రోడ్లపై ప్రవహిస్తుంది, స్తంభాలపై దీపాలు లేవు, వైర్లు తెగిపోయే స్థితిలో ఉన్నాయి, మురికినీటి నిల్వలను తక్షణం తొలగించాలి, డ్రైనేజీ పైపులు పూర్తిగా మార్చాలి నిత్యం నియమిత సమయంలో నీటి సరఫరా నిర్ధారించాలి విద్యుత్ సౌకర్యాలు పునరుద్ధరించాలి. అని రవి యాదవ్ పేర్కొన్నారు. రవి యాదవ్ మాట్లాడుతూ.. ప్రజల ప్రాథమిక సమస్యల పరిష్కారం ప్రభుత్వం యొక్క మొదటి బాధ్యత. ఈ సమస్యలు తక్షణం పరిష్కరించేలా మేము నిరంతరం పోరాటం చేస్తాము అన్నారు. ఈ కార్యక్రమంలో కే.ఎన్.రాములు, మల్లేష్ ముదిరాజ్, స్వామీనాథ్, వెంకటరెడ్డి, శ్రీకాంత్ యాదవ్, గడ్డం శ్రీనివాస్, గంగాధర్ గౌడ్, సుమన్, నవీన్ గౌడ్, సాయి నందన్ ముదిరాజ్, వెంకటేష్ యాదవ్, పవన్, స్వామి, శ్రీశైలం యాదవ్, రాజు గౌడ్, వడ్డే శ్రీనివాస్, ప్రవీణ్ యాదవ్, శంకర్, మున్నా, దివ్య, నిరూప తదితరులుపాల్గొన్నారు.

# అక్రమ కేసులపై జర్నలిస్టుల నిరసన

- టీయూడబ్ల్యూజే టీజేఎఫ్ ఆధ్వర్యంలో జడ్పీ సెంటర్లో నల్ల జెండాలతో ప్రదర్శన
- భారీగా హాజరైన విలేకరులు
- మద్దతుగా ఆందోళనలో పాల్గొన్న ఐజేయు నాయకులు



**ఖమ్మం జిల్లా బ్యూరో రాజముద్ర న్యూస్ సెప్టెంబర్ 15 :** జర్నలిస్టులపై దాడులు, అక్రమ కేసులపై ఖమ్మం జిల్లా జర్నలిస్టులు గళమెత్తారు. ప్రభుత్వ నియంతృత్వ ధోరణిని ప్రశ్నిస్తూ నినాదాలతో హోరెత్తించారు. ఒక ప్రముఖ న్యూస్ ఛానెల్ జిల్లా బ్యూరో సాంబశివరావు, కెమెరామెన్ నాగరాజు పై పెట్టిన అక్రమ కేసు ఎత్తివేయాలంటూ నల్ల జెండాలతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఖమ్మం జెడ్పీ సెంటర్ లోని అంబేద్కర్ విగ్రహం దగ్గర ఆందోళన చేశారు. టియుడబ్ల్యూజే టీజేఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనకు ఐజేయు నేతలు సంఘీభావం ప్రకటించి, నిరసనలో పాల్గొన్నారు. భారీ సంఖ్యలో జర్నలిస్టులు తరలి రావడంతో ఖమ్మం జడ్పీ సెంటర్ నినాదాలతో దద్దరిల్లింది. జర్నలిస్ట్ సాంబశివరావుతో పాటు కెమెరామెన్ తమ విధుల్లో భాగంగా యూరియా కొరతపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడతారా అని టీయూడబ్ల్యూజే ఐజేయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాం నారాయణ, టీజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆకుతోట ఆదినారాయణ, ఐజేయూ జిల్లా అధ్యక్షుడు ఏనుగు వెంకటేశ్వరరావు, టీజేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్రా రవి ప్రశ్నించారు. భావ ప్రకటన స్వేచ్ఛను హరించేలా ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించడం ఎంతవరకు సమంజసం అని నిలదీశారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా, ప్రభుత్వాల తప్పులను ఎత్తిచూపటమే జర్నలిస్టుల డ్యూటీ అని గుర్తు చేశారు. రాజ్యాంగాన్ని అవమానించేలా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. కావాలని, దురుద్దేశపూర్వకంగానే ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన రైతుతో తప్పుడు కేసు పెట్టించారని ఫైరయ్యారు. ప్రభుత్వం తప్పులుంటే సరిదిద్దుకోవాలి తప్పించి, వార్తను రిపోర్టు చేసిన విలేకరులపై కేసులు పెడతారా అని మండిపడ్డారు. సాంబశివరావు, నాగరాజు పై పెట్టిన కేసులను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### ఆందోళనలో పాల్గొన్న ఐజేయు నాయకులు..

టీయూడబ్ల్యూజే టీజేఎఫ్ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో... టీయూడబ్ల్యూజే ఐజేయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే రామనారాయణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాటేటి వేణుగోపాల్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నర్వనేని వెంకట్రావు జిల్లా అధ్యక్షులు ఏనుగు వెంకటేశ్వరావు పాల్గొని ప్రసంగించారు.

### నల్ల జెండాలతో అంబేద్కర్ సెంటర్లో జర్నలిస్టులు నిరసన...

తొలుత సోమవారం ఉదయం జర్నలిస్టు సాంబశివరావు తో పాటు ఆ ఛానల్ కెమెరామెన్ మరో సహాయకుని పై కేసు నమోదు చేయడాన్ని నిరసిస్తూ ఖమ్మంలోని అంబేద్కర్ సెంటర్లో జర్నలిస్టులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. నల్లజెండాలు చేతబట్టి నిరసన ప్రదర్శన చేపట్టారు. అంబేద్కర్ సెంటర్ వరకు నల్ల జెండాల తో నిరసన ప్రదర్శన నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో వివిధ దిన పత్రికలు, చానళ్ల కు చెందిన జర్నలిస్టులు, డిజిటల్ మీడియా జర్నలిస్ట్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో టియుడబ్ల్యూజే టీజెఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు బొల్లం శ్రీనివాస్, వనం నాగయ్య, ప్రశాంత్ రెడ్డి, శెట్టి రజనీకాంత్, జిల్లా నాయకులు అడపాల నాగేందర్, దుంపల భాస్కర్, కె హరీష్ మందటి వెంకటరమణ, మందుల ఉపేందర్,రాజ్ న్యూస్ ఉపేందర్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శి కొరకొప్పుల రాంబాబు, ఆర్టివి జిల్లా ఇన్చార్జి ఉదయ్, శేఖర్ టీఎస్ చక్రవర్తి, అమరవరపు కోటేశ్వరరావు, ఎలక్ట్రానిక్ మీడియా నగర అధ్యక్షులు ఎలమందల జగదీష్, కార్యదర్శి అశోక్, సీనియర్ జర్నలిస్టు రామిశెట్టి విజేత, వీడియో జర్నలిస్ట్ నాయకులు పృథ్వీ, రంగ నాగేశ్వరరావు గణేష్ సుధాకర్ సతీష్ వినయ్ సంతోష్ కాపర్తి నరేంద్ర, బిక్కి గోపి, ముత్యాల కోటేశ్వరరావు వెంకటకృష్ణ అంతోటి శ్రీనివాస్ శ్రీనివాసరెడ్డి నల్లమోతు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఐజెయూ నేతలు ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు యం భూపాల్ మహేందర్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు కనకం సైదులు జిల్లా కోశాధికారి శివానంద, నగర అధ్యక్షులు చెరుకుపల్లి శ్రీనివాస్ నగర ప్రెస్ క్లబ్ కార్యదర్శి శీలం శ్రీనివాస్ మీడియా ప్రతినిధులు శ్రీధర్ నారాయణ సత్యనారాయణ వీడియో జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు అప్పారావు పాల్గొన్నారు.


# నెతన్యాహూ జాగ్రత్త..

- ఖతార్ మా మిత్ర దేశం.. వారి జోలికి మాత్రం వెళ్లొద్దు
- ఇజ్రాయెల్కు ట్రంప్ వార్నింగ్



**యూఎస్ :** గత వారం గాజాలో కాల్పుల విరమణ కోసం అమెరికా చేసిన ప్రతిపాదనలపై చర్చించేందుకు దోహాలో సమావేశమైన హమాస్ నేతలపై 'సమ్మిట్ ఆఫ్ ఫైర్' పేరుతో ఇజ్రాయెల్ విరుచుకుపడిన విషయం తెలిసిందే. దీనిపై తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. ఖతార్ తమకు చాలా ముఖ్యమైన మిత్ర దేశమని.. దానిపై ఏదైనా నిర్ణయం తీసుకోవాలనుకున్నప్పుడు ఇజ్రాయెల్ ఆచితూచి వ్యవహరించాలని ఆ దేశ ప్రధాని నెతన్యాహును హెచ్చరించారు. ఖతార్ ఎమిర్ షేక్ తమీమ్ బిన్ హమద్ అల్–థానీని అద్భుతమైన వ్యక్తిగా ట్రంప్ అభివర్ణించారు. ఇజ్రాయెల్ హమాస్పై ఎటువంటి చర్యలు తీసుకున్నప్పటికీ ఖతార్ జోలికి మాత్రం వెళ్లొద్దని అన్నారు. కాల్పుల విరమణకు సంబంధించి యూఎస్ ప్రతిపాదన మేరకు ఇటీవల దోహాలో ఖతార్ అధికారులు, హమాస్ నేతలు భేటీ అయ్యారు. వీరి మధ్య చర్చలు జరుగుతుండగానే ఇజ్రాయెల్ వైమానిక దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో వారెవరూ ప్రాణాలు కోల్పోలేదు. అయితే, ఈ దాడులను ఖతార్ తీవ్రంగా పరిగణించింది. మధ్యవర్తిత్వ సూత్రంపై జరిగిన దాడిగా అభివర్ణించింది. కాగా భారత్తో సహా పలు దేశాలు ఈ దాడులను ఖండించాయి. మరోవైపు– అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఆదివారం ఇజ్రాయెల్కు చేరుకున్నారు. గాజా సమస్యకు పరిష్కారం ఏమిటనేది ఇజ్రాయెల్ అధికారుల్ని అడిగేందుకు ఆయన అక్కడికి వెళ్లినట్లు సమాచారం. అయితే ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మాత్రం తాము చేసిన దాడులను సమర్థించుకున్నారు. అక్టోబర్ 7న ఇజ్రాయెల్పై హమాస్ చేసిన దాడులను.. అమెరికా లో జరిగిన 9/11 దాడులతో పోల్చారు. ఆయన ఓ వీడియోలో మాట్లాడారు. హమాస్తో యుద్ధానికి దారితీసిన అక్టోబరు 7 నాటి దాడులను ఆయన ప్రస్తావించారు. వీటిని అమెరికాలో జరిగిన 9/11 దాడులతో పోల్చుతూ.. నాడు యూఎస్ ఎలా స్పందించిందో ప్రస్తుతం తాము అలాగే చేశామన్నారు. దాడులకు కారణమైన ఉగ్రవాదులు ఏ దేశంలో ఉన్నా వెంటాడి హతమారుస్తామని నాడు అమెరికా ఏ విధంగా చెప్పిందో.. ప్రస్తుతం తాము కూడా అదే చేశామని అన్నారు.

# దెబ్బకు దిగొచ్చిన ట్రంప్..
## విదేశీ ఉద్యోగులను నియమించుకోండంటూ పోస్ట్



**యూఎస్ :** అమెరికా పరిశ్రమలలో విదేశీ ఉద్యోగుల అవసరం ఉందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. యూఎస్లో పెట్టుబడుల గురించి తాము ఆలోచిస్తామంటూ దక్షిణకొరియా నుంచి హెచ్చరికలు వచ్చిన నేపథ్యంలో అధ్యక్షుడు దెబ్బకు దిగొచ్చారు. ఇంతకీ ఏం జరిగిందంటే..? ట్రంప్ అధికారం లోకి వచ్చిన దగ్గరి నుంచి అక్రమ వలసల విషయంలో కఠినవైఖరి అవలంబిస్తున్నారు. వారిని గుర్తించి, వెనక్కి పంపిస్తున్నారు. ఇందులోభాగంగానే ఇటీవల జార్జియాలో 475 మంది అక్రమ వలసదార్లను నిర్బంధించినట్లు హోంల్యాండ్ సెక్యూరిటీ ప్రకటించింది. జార్జియాలో దక్షిణ కొరియాకు చెందిన హ్యుందాయ్ కంపెనీ ప్లాంట్లో దక్షిణకొరియా వాసులు అక్రమంగా పని చేస్తున్నారన్న సమాచారం ఆధారంగా ఈ రైడ్ జరిగింది. ఇక్కడ అదుపులోకి తీసుకున్నవా రిలో ఆ దేశవాసులే ఎక్కువగా ఉన్నారు. ఇది రెండు దేశాల మధ్య దౌత్యప రమైన ఉద్రిక్తతలకు దారితీసింది. దీనిపై దక్షిణకొరియా అధ్యక్షుడు లీ జే మ్యూంగ్ స్పందించారు. "ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా మా వ్యాపార సంస్థలు యూఎస్లో పెట్టుబడులు పెట్టడానికి వెనకాడతాయి" అని హెచ్చరించారు.
ఈనేపథ్యంలో డొనాల్డ్ ట్రంప్ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. "సంక్లిష్టమైన ఉత్పత్తులను తయారు చేస్తోన్న విదేశీ కంపెనీలు అమెరికాలో భారీ పెట్టుబడులు పెట్టిన సమయంలో నైపుణ్యం కలిగిన కార్మికులు అవసరం అవుతుంటారు. కొంతకాలం నిపుణులైన కార్మికులను వారు మా దేశానికి తీసుకురావాలని నేను కోరుకుంటున్నాను. వారి నుంచి మన కార్మికులు శిక్షణ పొందాలి. లేకపోతే ఆ భారీ పెట్టుబడుల వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. మేం ఆ విదేశీ సంస్థల ఉద్యోగులను స్వాగతిస్తున్నాం. మేం వారినుంచి నేర్చుకొని, వారికంటే మెరుగ్గా రాణిస్తాం" అని ట్రంప్ రాసుకొచ్చారు.

## ఏకపక్షంగా వేధించేందుకే
# అమెరికా ఆర్థిక బలప్రదర్శన

- వాషింగ్టన్ చెప్పినట్లు చేస్తే ప్రతిచర్యలు చేపడతామం
- తీవ్రంగా హెచ్చరించిన చైనా

**తమతోపాటు పలు దేశాలు రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు వాటిపై నాటో, జీ7 దేశాలు టారిఫ్లు విధించాలని అమెరికా పిలుపునివ్వడంపై చైనా తీవ్రంగా స్పందించింది. కేవలం ఏకపక్షంగా వేధించేందుకు ఆర్థిక బలప్రదర్శనకు ఇటువంటి చర్యలు చేపడుతోందని ఆరోపించింది. వాషింగ్టన్ చెప్పినట్లు చేస్తే మాత్రం తాము ప్రతిచర్యలు చేపడతామని తీవ్రంగా హెచ్చరించింది. ఓ పక్క స్పెయిన్ మాడ్రిడ్లో సోమవారం నుంచి ఇరు దేశాల ప్రతినిధుల మధ్య చర్చలు మొదలైన వేళ చైనా నుంచి ఈ ప్రతి స్పందన రావడం గమనార్హం.**



**చైనా :** రోజు వారీ సాధారణ ప్రెస్ బ్రీఫింగ్స్లో భాగంగా చైనా విదేశాంగశాఖ ప్రతినిధి లిన్ జిన్ మాట్లాడుతూ ప్రపంచంలోని ఇతర దేశాల వలే రష్యాతో కూడా తమకు సాధారణ సంబంధాలున్నాయన్నారు. ఇది అంతర్జాతీయ చట్టాలకు పూర్తిగా అనుగుణంగానే ఉన్నట్లు పేర్కొన్నారు." అమెరికా చర్యలు ఏకపక్ష వేధింపులు.. ఆర్థిక బలప్రదర్శనకు నిదర్శనం. ఇవి తీవ్ర స్థాయిలో అంతర్జాతీయ వాణిజ్య నిబంధనలను దెబ్బతీస్తాయి. అంతేకాదు.. ప్రపంచ వాణిజ్య, పారిశ్రామిక పంపిణీ వ్యవస్థలపై కూడా ప్రతికూల ప్రభావం ఉంటుంది. భయపెట్టడం, ఒత్తిడి చేయడం వంటివి సమస్యలను పరిష్కరించలేవని ఎప్పుడో నిరూపితమైంది. ఉక్రెయిన్ విష యంలో చైనా విధానం ఎప్పుడూ ఒక్కటే. కేవలం చర్చలు, సంప్రదింపులతోనే ఆచరణయోగ్యమైన పరిష్కార మార్గం లభిస్తుంది" అని పేర్కొన్నారు. ఏకపక్ష ఆంక్షలను చైనా ఎప్పుడూ వ్యతిరేకిస్తుందని చెప్పారు. ఐరోపా, అమెరికా ఇప్పటికే రష్యాతో వ్యాపార లావాదేవీలు జరుపుతున్నాయని గుర్తు చేశారు. ఇక తమ, రష్యా సంస్థల మధ్య సహకారం ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలకు అనుగుణంగా ఉంటుందన్నారు. నాటో దేశాలన్నీ రష్యా నుంచి చమురు కొనుగోలు నిలిపివేయాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శనివారం పిలుపునిచ్చారు. దాంతో పాటు రష్యన్ పెట్రో లియం కొంటున్న చైనాపై 50 నుంచి 100 శాతం సుంకాలు విధిస్తానని కూడా ట్రంప్ సంకేతం పంపారు. భారీస్థాయిలో డ్రాగన్పై సుంకాలు విధిస్తేనే రష్యా–ఉక్రెయిన్ యుద్ధం నిలిచిపోతుందని తాను విశ్వసిస్తున్నట్లు ప్రకటించారు. కొన్ని నాటో దేశాలు ఇప్పటికీ రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుండటం దిగ్భ్రాంతికి గురిచేస్తోందని ట్రంప్ తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. యుద్ధాన్ని నిలువరించేందుకు కావాల్సిన నిబద్ధత కొన్ని నాటో దేశాల్లో తక్కువగా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

## చట్టవిరుద్ధంగా ఉంటే..
# 'ఎస్ఐఆర్'ను రద్దు చేస్తాం
## ఈసీకి 'సుప్రీం' హెచ్చరిక



**న్యూఢిల్లీ :** బిహార్ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు ఎన్నికల కమిషన్ అనుసరించిన పద్ధతిలో ఏదైనా చట్టవిరుద్ధంగా కనిపిస్తే మొత్తం 'ఎస్ఐఆర్'ను రద్దు చేస్తామని సుప్రీం కోర్టు ఎన్నికల కమిషన్ను హెచ్చరించింది. అయితే రాజ్యాంగ సంస్థ అయిన ఎన్నికల సంఘం ఎన్నికల నిర్వహణలో సరైన నిబంధ నలను పాటించిందని భావిస్తున్నట్లు పేర్కొంది. బిహార్లో ఈసీ చేపట్టిన ఓటరు జాబితా సర్వేకు వ్యతిరేకంగా దాఖలైన వ్యాజ్యాన్ని విచారించిన జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్మాల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ప్రస్తుతం ఈ విషయంపై తాము అసంపూర్తి అభిప్రాయాలు వెల్లడించలేమని..అక్టోబర్ 7న తుది వాదనలు విన్న తర్వాత తీర్పును వెలువరిస్తామని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. బిహార్ సమగ్ర ప్రత్యేక సవరణలో ఆధార్ను కూడా కచ్చితంగా గుర్తింపు కార్డుగా పరిగణించాలని ఇటీవల సుప్రీం కోర్టు ఎన్నికల కమిషన్కు మార్గదర్శకాలు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే ముందస్తు సూచనలు ఉన్నప్పటికీ ఎన్నికల అధికారులు ఆధార్ను గుర్తింపు కార్డుగా అంగీకరించడానికి నిరాకరిస్తున్నారని ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో న్యాయస్థానం ఎన్నికల కమిషన్ చూపిస్తున్న అభ్యంతరాలను తోసిపుచ్చింది. ఆధార్ పౌరసత్వాన్ని నిరూపించలేకపోయినప్పటికీ.. అది ప్రజల గుర్తింపుకు చట్టబద్ధమైన రుజువుగా మిగిలిపోయిందని స్పష్టం చేసింది. కాగా బిహార్ ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం ఓటరు జాబితాల 'ప్రత్యేక సమగ్ర సవరణ' పేరిట భాజపాతో కలిసి ఓట్ల చోరీకి ప్రయత్నిస్తోందని విపక్ష కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తోంది. గత కొన్నేళ్లుగా దేశంలో జరుగుతున్న అన్ని ఎన్నికల్లో ఇదే విధంగా ఓట్ల చోరీ జరిగిందని ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఇప్పటికే ఈ విషయంలో ఆధారాలను ప్రజలముందుకు తీసుకువచ్చామని..త్వరలో మరిన్ని ఆధారాలతో ఈసీ చేస్తున్న చట్ట వ్యతిరేక చర్యలను బయటపెడతామని హెచ్చరించారు.

# మోదీ పాలన

## గుజరాత్ మోడల్ నుంచి భారతీయ మోడల్ దాకా...

### కేంద్రమంత్రి మాన్సుఖ్ మాండవీయ



దేశానికి ఎక్కువ కాలం ప్రధానమంత్రులుగా సేవలందించిన వారిలో రాష్ట్రాలకు ముఖ్యమంత్రులుగా పనిచేసి వచ్చినవారు చాలా తక్కువ. వాళ్లలో చాలావరకూ సమాఖ్య అనుభవం అంతగా లేని 'జాతీయ' నాయకులే. మొదట పేర్కొన్న ఆ అతికొద్దిమందిలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఒకరు. 2014లో ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టే నాటికే.. దశాబ్దం పాటు గుజరాత్ రాష్ట్ర పాలనలో నరేంద్ర మోదీ తన కార్యాచరణ సామర్థ్యతను సానబెట్టుకుని ఉన్నారు. క్షేత్ర స్థాయిలో కార్యక్రమాల వైఫల్యానికి లేదా విజయవంతం కావడానికి కారణమయ్యే అంశాలను ఆ సమయంలోనే ఆయన నిశితంగా గమనించారు. కేవలం విధాన రూపకల్పన మాత్రమే కాకుండా.. వాటిని సమర్థంగా అమలు చేయడమే పరిపాలనకు కేంద్రంగా నిలిపిన మొదటి ప్రధానమంత్రిగా నిలిచారు. తదనుగుణంగా ప్రభుత్వ కార్యాచరణను మెరుగుపరిచారు. విద్యుత్తు నుంచి బ్యాంకింగ్ వరకు, సంక్షేమం నుంచి మౌలిక సదుపాయాల వరకు... నాటి నుంచి ఈ సామర్థ్యమే ప్రభుత్వం ప్రజలకు అందించే సేవలను పునర్నిర్దేశించింది.

## అనుభవాన్ని ప్రతిబింబించేలా కార్యాచరణ

కేంద్ర ప్రభుత్వ సమర్థ కార్యాచరణ దిశగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కృతనిశ్చయులయ్యారు. విద్యుత్ రంగం పట్ల ఆయన వైఖరిలో విధానపరమైన దృక్పథం దీన్ని స్పష్టం చేస్తోంది. గుజరాత్‌లోని గ్రామాల్లో స్తంభాలు, లైన్లు ఉన్నప్పటికీ.. విద్యుత్తే లేదన్న విషయాన్ని ఆయన గుర్తించారు. దీనికి పరిష్కారంగా అమలు చేసినదే జ్యోతిగ్రామ్ యోజన. దీని ద్వారా ఫీడర్లను విభజించి.. గృహాలకు 24 గంటల విద్యుత్ సరఫరా చేయడంతోపాటు వ్యవసాయ క్షేత్రాలకూ చెప్పుకోదగ్గ రీతిలో కరెంటు అందించారు. ప్రధానమంత్రిగా దీనదయాళ్ ఉపాధ్యాయ గ్రామజ్యోతి యోజన ద్వారా ఆయన ఈ సూత్రాన్ని మరింత ముందుకు తీసుకెళ్లి.. 18,374 గ్రామాలకు విద్యుత్ భరోసా కల్పించారు. 2023 నాటికి.. దేశంలో 11 కోట్లకు పైగా ప్రజలకు ఉపాధి కల్పిస్తున్న, దేశ జీడీపీలో దాదాపు 29 శాతం వాటాను కలిగి ఉన్న ఎంఎస్ ఎంఈలకు ఈ విద్యుత్ సరఫరా వెన్నెముకగా నిలిచింది. బ్యాంకింగ్‌లోనూ ఇవే మార్గదర్శకాలను అమలు చేశారు. గ్రామీణ కుటుంబాలకు బ్యాంకు ఖాతాలు ఉన్నప్పటికీ అవి పేపర్లకే పరిమితమై క్రియాశూన్యంగా ఉండేవి. జన్‌ధన్ యోజన ఆ పరిస్థితిని మార్చేసింది. ఆధార్, మొబైల్ ఫోన్లను వ్యక్తిగత బ్యాంకు ఖాతాలతో అనుసంధానం చేయడం చేయడం ద్వారా.. ఒకప్పుడు బలహీనంగా ఉన్న వ్యవస్థే నేడు నేరుగా నగదు బదిలీలకు పునాది అయ్యింది. ఇది ప్రభుత్వం అందించే ప్రయోజనాన్ని మధ్యవర్తుల ప్రమే యం లేకుండా నేరుగా ప్రజలకే చేరవేయడంతోపాటు.. లీకేజీలను అరికట్టింది. తద్వారా ప్రభుత్వ ఖజానాలో భారీగా ఆదా చేసింది. గృహ నిర్మాణం మరో అంశం. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద నిర్మాణ దశలను బట్టి చెల్లింపులను వాటితో అనుసంధా నించారు. జియోట్యాగింగును ఉపయోగించి వాటిని పర్యవేక్షిం చారు. నాణ్యమైన నిర్మాణాలపై దృష్టి సారించారు. అసంపూ ర్తిగా ఉన్న పైపై మెరుగుల ఇళ్లను ప్రారంభించే గత ప్రభుత్వాల ధోరణికి భిన్నంగా.. సంపూర్ణ, నివాసయోగ్యమైన గృహాలు మొదటిసారిగా లబ్ధిదారులకు లభించాయి.

### సమర్థతను పెంచిన సమాఖ్య ధోరణి:

కేంద్రం – రాష్ట్రం మధ్య సమన్వయమే పురోగతికి మూలాధారమన్న అంశాన్నీ గుజరాత్ ద్వారా నరేంద్ర మోదీ గ్రహించారు. ఇది జాతీయ స్థాయిలో సహకార సమాఖ్యగానూ పోటీ సమాఖ్యగానూ మారింది. దశాబ్దాలుగా నిలిచిపోయి ఉన్న వస్తు, సేవల పన్నును రాష్ట్రాలతో ఏకాభిప్రాయం ద్వారా ఆమోదించారు. జీఎస్టీ కౌన్సిల్ ఆర్థిక సంప్రదింపులను సంస్థాగతీకరించడంతోపాటు ఏకీకృత జాతీయ మార్కెటును సృష్టించింది. ఇవేకాకుండా.. కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు పంపిణీ చేసే వాటాను ఆయన పెంచారు. ఇది రాష్ట్రాలకు మరింత ఆర్థిక స్వేచ్ఛను, ప్రాధాన్యాలను నిర్ణయించుకోవడంలో స్వయంప్రతిపత్తిని కల్పించింది. అదే సమయంలో, సులభతర వాణిజ్యం విషయంలో రాష్ట్రాలకు ర్యాంకింగ్ ఇవ్వడం ద్వారా, సంస్కరణలను ప్రోత్సహించడం ద్వారా పోటీ సమాఖ్య విధానాన్ని ఆయన ముందుకు తీసుకెళ్లారు. కేవలం నిధుల స్వీకర్తలుగానే కాకుండా, దేశ వృద్ధిలో భాగస్వాములుగా నిలిచేలా ఈ మార్పులు రాష్ట్రాలను రాష్ట్రాలకు ప్రోత్సహాన్నిచ్చాయి. మౌలిక సదుపాయాల విషయానికొస్తే.. గుజరాత్‌లో చేపట్టిన బి ఐ ఎస్ ఏ జి మ్యాపింగ్ ప్రయోగాలను ప్రధానమంత్రి గతిశక్తి పరిధిలోకీ తెచ్చారు. ఇందులో భాగంగా 16 మంత్రిత్వ శాఖలు, అన్ని రాష్ట్రాలు ఒకే డిజిటల్ వేదికపై 1,400 ప్రాజెక్టులకు ప్రణాళిక వేసుకునే అవకాశముంది. ఇది ఆమోదపరమైన జాప్యాలను తగ్గించడంతోపాటు అమలును సమన్వయపరుస్తుంది.

### ఉత్పాదకతను పెంచేలా సంక్షేమం:

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృష్టిలో సంక్షేమ పథకాలంటే.. ప్రజలను సాధికారులను చేయడానికి ఉద్దేశించిన ఉత్పాదకతా పెట్టుబడులు. గుజరాత్‌లో చేపట్టిన నమోదు కార్యక్రమం, కన్యా కెలవాణి వంటి కార్యక్రమాల ద్వారా 2001లో 57.8 శాతంగా ఉన్న గుజరాత్ అక్షరాస్యత 2011 నాటికి 70.7 శాతానికి పెరిగింది. జాతీయ స్థాయిలో.. ఇది బేటీ బచావో, బేటీ పఢావో కార్యక్రమంగా మారింది. దీని ద్వారా పిల్లల్లో లింగనిష్పత్తి మెరుగుపడింది. అది 2014 లో 918 నుంచి 2023 నాటికి 934కు పెరిగింది. బాలికలను పాఠశాలకు పంపించడం వల్ల.. వారికి త్వరగా పెళ్లి చేయడం తగ్గింది, వారి ఆరోగ్యం మెరుగుపడింది. దీర్ఘకాలంలో వారి సమర్థతను, ఉత్పాదకతను ఇది పెంచింది. కార్మిక శక్తిలో వారి ప్రాతినిధ్యాన్ని పెంచి, తద్వారా దేశ పురోగతిలో వారు మరింత సమర్థంగా భాగస్వాములయ్యేలా అవకాశాన్నిచ్చింది. బాలింతల ఆరోగ్యం పట్ల అదే శ్రద్ధ కనబరిచారు. గుజరాత్‌లో చిరంజీవి యోజన ద్వారా ఆస్పత్రుల్లో ప్రసవాలపై సబ్సిడీ ఇచ్చారు. దాంతో మరణాలు తగ్గాయి. కేంద్ర ప్రభుత్వ స్థాయిలో చేపట్టిన ప్రధానమంత్రి మాతృ వందన యోజన ద్వారా మూడు కోట్లకు పైగా మహిళలు ప్రయోజనాలను పొందారు. ఈ పథకం ద్వారా ప్రసవానంతరం పలు ప్రయోజనాలతోపాటు పోషకాహారాన్ని అందించారు. సామాజిక వ్యయం దౌర్బల్యాన్ని తగ్గించాలి, అవకాశాలను విస్తరించాలి, భవిష్యత్ కార్మిక శక్తి సామర్థ్యాన్ని పెంచాలి – ఈ ఆదర్శమే ఆయా కార్యక్రమాలను ముందుకు నడుపుతోంది.

### వికసిత భారత్- 2047 దిశగా...

సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్... ఇవి కేవలం మాటలకే పరిమితం కాదు. రోజూ మనం గమనిస్తున్న అంశాల్లో దాని ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది:– విద్యుత్తు ఇకపై విలాసమేమీ కాదు, సంక్షేమ ప్రయోజనాలు నేరుగా అందుతున్నాయి, డిజిటల్ సమన్వయంతో మౌలిక సదుపాయాల ప్రణాళికలు అమలవుతున్నాయి, ఆర్భాటాల కన్నా ఫలితాలకే ప్రాధాన్యమిచ్చేలా ఆరోగ్యం, విద్యా రంగాలు... ఇదీ ఇప్పుడు భారతీయ నమూనా. దేశం నలుమూలలా ప్రజా జీవితాల్లో పరివర్తనను తెస్తూ, పాలనను క్షేత్రస్థాయికి తీసుకెళ్లింది. 2047 నాటికి వికసిత భారత్‌గా ఎదగాలన్న లక్ష్యాన్ని దేశం సాధించాలంటే.. మన ప్రధానమంత్రి పరిపాలనా పునర్నిర్దేశం వల్లే సాకారమవుతుంది. కార్యాచరణనే పరిపాలనకు గీటురాయిగా మార్చడం ద్వారా.. విస్తృతమైన దేశ యంత్రాంగం వాగ్దానాలకు పరిమితం కాకుండా, సమర్థంగా సేవలను అందించేలా చేశారు. మొదట గుజరాత్‌లో పరీక్షించీ, అనంతరం దేశవ్యాప్తంగా విస్తరించిన ఈ నమూనా నిశ్చయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సాధించిన ఘన విజయమే.



### పెట్టుబడిదారులు, ప్రజల్లో విశ్వాసం

ఆలోచనా విధానంలో మార్పు అన్నది గుజరాత్ నమూనాలోని అత్యంత సునిశితమైన అంశం. నిరంతర క్రియాశీలత ద్వారా ఆలోచనా విధానాలు ఏ విధంగా మారుతాయో, అది ఓ రాష్ట్రాన్ని పెట్టుబడిదారుల దృష్టిలో విశ్వసనీయ పెట్టుబడి గమ్యస్థానంగా ఎలా నిలుపుతుందో, అధికార వర్గాన్ని వాణిజ్యానికి అనుకూలురుగా ఎలా మారుస్తుందో 'వైబ్రంట్ గుజరాత్' సదస్సులు చాటిచెప్పాయి. ఈ అనుభవమే 'మేకిన్ ఇండియా'ను తీర్చిదిద్దింది. అనుమతుల క్రమబద్ధీకరణ, ప్రత్యేక రవాణా మార్గాలు, మౌలిక సదుపాయాలతో సన్నద్ధత ద్వారా.. విశ్వసనీయతకు ఇది ప్రాధాన్యమిచ్చింది. 2014 – 2024 మధ్య రూ. 83 లక్షల కోట్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డీఐ) భారత్ ఆకర్షించింది. దేశ కార్యాచరణ సామర్థ్యం, దీర్ఘకాలిక విశ్వసనీయతపై వారి నమ్మకానికి ఇది నిదర్శనం. ప్రజల్లోనూ అంచనాలు పెరిగాయి. ఇంతకుముందు పథకాలు ప్రకటనలకే పరిమితమయ్యేవి. కానీ ఇప్పుడు.. ప్రభుత్వం అందించే నిత్యావసరాలు, విద్యుత్తు, టాయిలెట్లు, బ్యాంకు ఖాతాలు, సబ్సిడీ గ్యాస్ కచ్చితంగా తమవరకూ చేరుతాయని సగటు భారతీయుడు భావిస్తున్నాడు. కేవలం ఉద్దేశాలను మాత్రమే కాకుండా, అమలునే హామీలకు కొలమానంగా భావించే రాజకీయ వాతావరణం ఈ సానుకూల మార్పుల ద్వారా ఏర్పడింది. అనేక విధాలుగా పెరిగిన ఈ అంచనాలే గుజరాత్ నమూనా ద్వారా పొందిన ఘన వారసత్వం.



**వ్యాసకర్త :**

మాన్సుఖ్ మాండవీయ,
కేంద్ర కార్మిక, ఉపాధి, యువజన వ్యవహారాలు,
క్రీడాశాఖా మంత్రి



CINEMA

అక్షర రాజముద్ర
www.rajamudranews.com
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక



## బాలీవుడ్ ఇన్‌సైడర్స్ ఇష్టపడరు : అమీషా పటేల్

ఒకప్పుడు బాలీవుడ్‌ను ఏలిన బ్యూటీ క్వీన్ అమీషా పటేల్.. సడెన్‌గా డిజప్పియర్ అయింది. తెలుగులో బద్రి, నాని లాంటి సినిమాల్లో మెరిసి.. అందానికే అందం నిర్వచనం గురించి చెప్పిందనే ప్రశంసలు అందుకుంది. ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసింది. కానీ ఆ తర్వాత కనిపించలేదు. చాలా ఏళ్ల తర్వాత 'గదర్ 2'లో కనిపించిన ఆమె.. అవకాశాలు ఎందుకు రాలేదో చెప్పుకొచ్చింది. బాలీవుడ్ తనను ఎందుకు వేరుగా చూస్తుందో వివరించింది. బాలీవుడ్ ఇన్‌సైడర్స్ తనను ఇష్టపడరని.. కారణం పాత్రల కోసం పడుకునే క్యారెక్టర్ తనది కాదని చెప్పింది అమీషా. మందు తాగనని, పార్టీలకు హాజరు కానని.. అందుకే అవుట్ సైడర్‌గా ట్రీట్ చేస్తారని, ఈ కారణంగా చాలా అవకాశాలను కోల్పోయానని తెలిపింది. సాధారణ హీరోయిన్ల మాదిరిగా రాజీపడకుండా.. ఇందుకు విరుద్ధంగా ఉండటంతో ఇండస్ట్రీ నుంచి వెలివేశారని, ఇప్పటికీ ఛాన్స్‌లు రావట్లేదని వివరించింది. ఇండైరెక్ట్‌గా నెపోటిజం, ఫేవరెట్‌నెస్ గురించి కామెంట్స్ చేసిన ఆమె.. ప్రతిభ, ప్రేక్షకుల మద్దతుతో ముందుకు సాగుతానని చెప్పింది.

## దుల్కర్ మూవీలో పూజాహెగ్డే

**తాజాగా రమ్యకృష్ణ నటిస్తున్నట్లు ప్రకటన**



మాలీవుడ్ స్టార్ యాక్టర్ దుల్కర్ సల్మాన్ ఇటీవలే కొత్త తెలుగు సినిమాను ప్రకటించాడని తెలిసిందే. దక్యూ41 వర్కింగ్ టైటిల్‌తో వస్తోన్న ఈ సినిమాను టాలీవుడ్ లీడింగ్ బ్యానర్ ఎస్ఎల్‌వీ సినిమాస్ తెరకెక్కిస్తోంది. ఈ చిత్రంలో పొడుగుకాళ్ల సుందరి పూజాహెగ్డే ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుందని ఇటీవలే ప్రకటించారు. కాగా మేకర్స్ ఇప్పుడు మరో క్రేజీ అనౌన్స్‌మెంట్ చేశారు. మరో స్టార్ రమ్యకృష్ణ ఈ చిత్రంలో కీలక పాత్రలో నటిస్తోంది. రమ్యకృష్ణకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ మేకర్స్ ఈ విషయాన్ని ప్రకటించారు. బాహుబలి ఫ్రాంచైజీలో శివగామి లాంటి పవర్ ఫుల్ రోల్‌తో గ్లోబల్ బాక్సాఫీస్‌ను షేక్ చేసింది రమ్యకృష్ణ. ఇంతకీ రమ్యకృష్ణ ఈ ప్రాజెక్టులో ఎలాంటి పాత్రలో కనిపించబోతున్నారన్నది మాత్రం ప్రస్తుతానికి సస్పెన్స్ నెలకొంది. ఈ మూవీతో రవి నేలకుడిటి డైరెక్టర్‌గా పరిచయమవుతున్నాడు. ప్రస్తుతం ఉ41 షూటింగ్ దశలో ఉంది. ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్ ఇటీవలే విడుదలైన లోక చాప్టర్ 1 బాక్సాఫీస్ వద్ద వసూళ్ల వర్షం కురిపిస్తోంది. కాగా ఈ బ్యానర్‌లో ప్రస్తుతం నాని నటిస్తోన్న ది ప్యారడైస్ కూడా ఉంది.

## దూసుకెళ్తున్న మిరాయ్

**రూ. 81.2 కోట్లు గ్రాస్ కలెక్షన్లు**



ఈగల్ సినిమా ఫేమ్ కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో మిరాయ్ అనే సినిమా చేసాడు యంగ్ హీరో తేజ సజ్జా. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ సినిమా ఈ నెల 12న పాన్ ఇండియా భాషలలో వరల్డ్ వైడ్ గా రిలీజ్ అయి బ్లాక్ బస్టర్ టాక్ తో దూసుకెళ్తోంది. తేజ సూపర్ యోధగా మంచు మనోజ్ యాంటోగనిస్టుగా అదరగొట్టారు. అందుకు తగ్గట్టే కలెక్షన్స్ లో మిరాయ్ దూసుకెళ్తోంది. భారీ హైప్ తో రిలీజ్ అయిన మిరాయ్ మొదటి రోజు వరల్డ్ వైడ్ గా రూ. 27.20 కోట్లు గ్రాస్ రాబట్టి సూపర్ స్టార్ట్ అందుకుంది. రెండవ రోజు రెండు తెలుగు రాష్ట్రల్లో టైర్ 2 హీరోల సినిమాల కంటే ఎక్కువ వసూళ్లు చేసి ఆల్ టైమ్ రికార్డ్ నమోదు చేసింది. ఇక వరల్డ్ వైడ్ గా శని, ఆదివారం వీకెండ్ దానికి తోడు బ్లాక్ బస్టర్ మౌత్ టాక్ తో ఎక్కడ చుసిన హౌస్ ఫుల్ బోర్డ్స్ పెట్టింది. రిలీజ్ అయిన తొలి మూడు రోజులకు గాను వరల్డ్ వైడ్ గా రూ. 81.2 కోట్లు గ్రాస్ రాబట్టి సెన్సేషనల్ క్రియేట్ చేసింది. ఓవర్సీస్ లోను మిరాయ్ దుమ్ములేపుతోంది. కేవలం నార్త్ అమెరికాలో 10.7 మిలియన్ వసూళ్లు చేసి 2 మిలియన్ కు దూసుకెళ్తోంది. లాంగ్ రన్ లో 3 మిలియన్ డాలర్స్ వసూలు చేస్తుందని ట్రేడ్ అంచానా వేస్తుంది. తెలుగు స్టేట్స్ లోను బ్రేక్ ఈవెన్ దాటి లాభాల బాటలో పయనిస్తున్న మిరాయ్ ఫైనల్ రన్ లో బయ్యర్స్ కు నిర్మాతలకు భారీ లాభాలు తెచ్చిపెట్టనుంది.

## 77వ ఎమ్మీ అవార్డుల ప్రకటన

అంతర్జాతీయ సినీ పరిశ్రమలో ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే 77వ ఎమ్మీ అవార్డుల వేడుక లాస్ ఏంజెలెస్‌లోని పికాక్ థియేటర్ వేదికగా అత్యంత వైభవంగా జరిగింది. హాలీవుడ్‌కు చెందిన ప్రముఖులు ఈ వేడుకలో సందడి చేశారు. ఎమ్మీ అవార్డులు అనేవి అమెరికన్ టెలివిజన్ పరిశ్రమలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన వాటికి ఇచ్చే ప్రత్యేక గౌరవం. ఈ అవార్డులని అకాడమీ ఆఫ్ టెలివిజన్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ ప్రతి సంవత్సరం ఇస్తూ వస్తుంది. ఈసారి నామినేషన్ల బరిలో ఎన్నో సినిమాలు, సిరీస్‌లు పోటీ పడ్డాయి. అందులో నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలైన అడాల్‌సెన్స్ ఘన విజయం సాధించి ఏకంగా 5 అవార్డులు సొంతం చేసుకోవడం విశేషం. ఇక ఇందులో నటించిన ఓవెన్ కూపర్, చిన్న వయసులోనే ఎమ్మీ అవార్డు గెలుచుకుని కొత్త రికార్డు సృష్టించాడు. ఈ వేడుకలో 20242025 సీజన్‌లో ప్రసారమైన కార్యక్రమాలకి అవార్డులని అందించారు. నెట్‌ఫ్లిక్స్‌లో ప్రసారమైన అడోలెసెన్స్, ఆర్కేన్ లీగ్ ఆఫ్ లెజెండ్స్ సిరీస్ అవార్డులని దక్కించుకున్నాయి.

# శరవేగంగా పెద్ది సినిమా షూటింగ్

**దసరాకు మ్యూజికల్ సింగిల్ విడుదలకు సన్నాహాలు**



గేమ్ ఛేంజర్ సినిమాతో ఈ ఏడాది పెద్దగా ఆకట్టుకోలేని రామ్‌చరణ్ ఇప్పుడు తన నెక్స్ట్ సినిమాతో మళ్ళీ మాస్‌ను ఉర్రూతలూగించేందుకు రెడీ అవుతున్నారు. ప్రస్తుతం చరణ్ ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందుతున్న పెద్ది సినిమాలో నటిస్తున్నారు. ఇది ఒక విలేజ్ స్పోర్ట్స్ రివెంజ్ డ్రామాగా రూపొందుతోంది. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాను సతీష్ కిలారు వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై, మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో నిర్మిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో శరవేగంగా జరుగుతోంది. రామోజీ ఫిల్మ్ సిటీలో వేసిన భారీ సెట్స్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. ఇక కర్ణాటకలోని మైసూరు ప్రాంతంలో వెయ్యి మందికి పైగా డ్యాన్సర్లతో షూట్ చేశారు. జానీ మాస్టర్ కొరియోగ్రఫీలో తెరకెక్కిన ఈ పాట సినిమాకే హైలైట్ కానుందని మేకర్స్ చెబుతున్నారు. ఈ చిత్రాన్ని రామ్‌చరణ్ పుట్టినరోజు సందర్భంగా వచ్చే మార్చి 27న వరల్డ్ వైడ్‌గా విడుదల చేయాలని టీమ్ ప్లాన్ చేసింది. కాగా, దసరా పండుగ సందర్భంగా పెద్ది నుంచి ఓ మ్యూజికల్ సింగిల్ విడుదల చేయనున్నట్లు సమాచారం. ఇప్పటికే రామ్‌చరణ్ ఆ పాటను విన్నట్టు, అది అద్భుతంగా ఉందని మెచ్చుకున్నట్టు సమాచారం. ఈ సినిమాలో హీరోయిన్‌గా బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ నటిస్తుండగా, సంగీత దర్శకుడిగా ఏఆర్ రెహమాన్ పనిచేస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ కు ప్రేక్షకుల నుంచి విపరీతమైన రెస్పాన్స్ వచ్చింది. ముఖ్యంగా రామ్‌చరణ్ క్రికెట్ షాట్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అయింది. కొంతమంది అంతర్జాతీయ క్రికెటర్లు కూడా దానిని రీక్రియేట్ చేయడంతో, సినిమా పట్ల ఆసక్తి మరింత పెరిగింది. రామ్‌చరణ్ అభిమానులు గేమ్ ఛేంజర్ ఫ్లాప్ తరువాత ఈ సినిమాపైనే ఆశలు పెట్టుకున్నారు.

## సంస్కారం లేని వార్తలు ప్రచారం

**జగపతి బాబు టాక్‌షోలో నటి మీనా ఆవేదన**

చైల్డ్ ఆర్టిస్టుగా ఇండస్ట్రీలోకి వచ్చిన మీనా అగ్ర కథానాయకుల సరసన నటించి స్టార్‌గా ఎదిగారు. తాజాగా జగపతిబాబుతో ఆమె జయమ్ము నిశ్చయమ్మురా కార్యక్రమానికి అతిథిగా హాజరై తన కెరీర్, పర్సనల్ లైఫ్ గురించి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. స్టార్ హీరోలతో నటించిన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కృష్ణ, రజనీకాంత్ ఇద్దరికీ తాను కూతురుగా, హీరోయిన్‌గా నటించినట్లు చెప్పారు. నటుడు జగపతి బాబు హోస్ట్‌గా వ్యవహరిస్తున్న ఈ టాక్ షో జీ 5 లో స్ట్రీమింగ్ అవుతోంది. ఇక తాను భర్తను కోల్పోయినప్పుడు సోషల్ మీడియాలో తనపై వచ్చిన న్యూస్‌పై మీనా అసహనం వ్యక్తంచేశారు. నా భర్త చనిపోయిన వారం తర్వాత నేను రెండో పెళ్లి చేసుకుంటున్నట్లు రాశారు. వాళ్లకు కుటుంబాలు ఉండవా.. ఇలా రాస్తున్నారు. అని చాలా బాధపడ్డాను. ఆ తర్వాత ఎవరు విడాకులు తీసుకొన్నా నాతో పెళ్లి అని రాసేవారు. అలాంటి వార్తల వల్ల నాకు అసహ్యం వేసేదని తెలిపారు. 1986లో చైల్డ్ ఆర్టిస్టుగా ఇండస్ట్రీలోకి వచ్చిన మీనా తమిళంతో పాటు తెలుగులోనూ అగ్ర హీరోల సరసన నటించారు. రజనీకాంత్, చిరంజీవి, వెంకటేశ్, నాగార్జున, బాలకృష్ణ అందరితోనూ హిట్ సినిమాల్లో అలరించారు. కెరీర్‌లో మంచి అవకాశాలు వస్తున్నప్పుడే 2009లో విద్యాసాగర్‌ను వివాహం చేసుకున్నారు. ఆయన 2022లో అనారోగ్యం కారణంగా తుదిశ్వాస విడిచారు. ప్రస్తుతం మీనా మూకుతి అమ్మన్ 2లో నటిస్తున్నారు. చాలామంది నిర్మాతలు ఫ్లాప్‌లలో ఉన్నామని తక్కువ అమౌంట్‌తో సినిమా చేస్తున్నామని నన్ను సంప్రదించేవారు. నేను సరేనని అంగీకరించేదాన్ని. ఆ చిత్రాలు సూపర్‌హిట్ అయ్యేవి. తర్వాత నన్ను మర్చిపోయేవారు. ఎప్పుడూ ఇలానే జరిగేది. కెరీర్‌లో వరుస అవకాశాలు వస్తున్నప్పుడే పెళ్లి చేసుకున్నాను. ఆ తర్వాత పాప పుట్టిన రెండేళ్లకు మలయాళం సినిమా దృశ్యం కోసం నన్ను సంప్రదించారు. పాపను వదిలి వెళ్లలేక తిరస్కరించాను. వాళ్లు రిక్వెస్ట్ చేశారు. కథ రాసేటప్పుడు నన్ను దృష్టిలోపెట్టుకున్నట్లు తెలిపారు. వేరే వారితో సినిమా చేయలేమన్నారు. దీంతో అంగీకరించాను. జగపతిబాబు నాకు ఎప్పుడూ పోటీనే.. మీ పక్కన నేను వస్తుంటే నన్ను ఎవరూ చూసేవారు కాదు. అందరూ మిమ్మల్నే చూసేవారు' అంటూ మీనా సరదా సంగతులు పంచుకున్నారు. దివంగత నటి సౌందర్యతో తన అనుబంధాన్ని పంచుకొని మీనా ఎమోషనల్ అయ్యారు. ఆరోజు ఎన్నికల ప్రచారానికి సౌందర్యతో పాటు తాను వెళ్లాల్సిఉందని కాకపోతే షూటింగ్ కారణంగా కుదరక వెళ్లలేదన్నారు.





## సపోర్ట్ లేకుంటే రాణించడం కష్టమే

**నటి ప్రియాంక చోప్రా మనోగతం**

చిత్రసీమలో బ్యాక్ గ్రౌండ సపోర్టు లేకుండా రాణించడం కష్టమే అని నటి ప్రయియాంక చోప్రా అభిప్రాయ పడ్డారు. 2000 సంవత్సరంలో మిస్ వరల్డ్ కిరీటాన్ని సొంతం చేసుకున్న అనంతరం నటి ప్రియాంక చోప్రా ఇండస్ట్రీకి వచ్చి స్టార్‌గా ఎదిగారు. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తాను సొంత నిర్మాణసంస్థను ప్రారంభించడానికి గల కారణాన్ని వెల్లడించారు. తరతరాలుగా ఇండస్ట్రీలో కొనసాగుతున్న వారు స్టార్‌లుగా ఉన్నారు. అలాంటప్పుడు బయట నుంచి వచ్చినవారు పరిశ్రమలో కొనసాగడం అంత సులభం కాదు. కానీ, నేను ఎంతో కష్టపడి ఆఫర్లు అందుకొని సక్సెస్ అయ్యాను. ఏదైనా పట్టుదలతో ప్రయత్నించడం నా అలవాటు. నేను ఇబ్బందిపడినట్లు ఎవరూ పడకూడదనే ఉద్దేశంతో.. సినీ నేపథ్యం లేకుండా కొత్తగా ఇండస్ట్రీకి వచ్చేవారిని ప్రోత్సహించడానికే నిర్మాణసంస్థను స్థాపించానని ప్రియాంక తెలిపారు. 2015లో తాను పర్పుల్ పెబుల్ పిక్చర్స్‌ను స్థాపించడానికి బాలీవుడ్ పరిస్థితులే కారణమన్నారు. 2000 సంవత్సరం మిస్ వరల్డ్ కిరీటం గెలుచుకున్న తర్వాత ఇండస్ట్రీలో ఆఫర్లు వచ్చాయి. హిందీ, తమిళ సినిమాల్లో నటించడం మొదలుపెట్టా. ఆ తర్వాత రెండేళ్లకు బాలీవుడ్ పరిస్థితులు అర్థమయ్యాయి. సినీనేపథ్యం లేకుండా ఇండస్ట్రీకి వచ్చినవారిని ఎంత చులకనగా చూస్తారో తెలుసుకొన్నాను. ప్రియాంక నిర్మాణసంస్థలో 2016లో సంతోశ్ మిశ్రా దర్శకత్వంలో వచ్చిన భోజ్‌పురి మొదటి సినిమాగా విడుదలైంది. ఆ తర్వాత ఆమె నటించిన పలు చిత్రాలు విడుదలై విజయాన్ని అందుకున్నాయి. ఇక ప్రియాంక సినిమాల విషయానికొస్తే.. ప్రస్తుతం ఎస్ఎస్ఎంబీ 29లో నటిస్తున్నారు. రాజమౌళి దర్శకత్వంలో మహేశ్‌బాబు హీరోగా ఇది రూపొందుతోంది.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com